తెలుగు దినపత్రిక
# సిరి
People's Voice వార్త పత్రిక
RNI TG TEL/ 26/A0381
21-08-2026
శుక్రవారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 194
PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–

తెలుగు దినపత్రిక
సిరి People's Voice
RNI:TGTEL/26/A0381
siridailynews@gmail.com
/siridailynews
@siridailynews
విలేకరులు కావలెను
ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.
99897 78881, 7702344303, 9440451575



## టీజీఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో
# పవర్ ఎగ్జిబిషన్-2026

- హైదరాబాద్ లో మూడు రోజుల పాటు నిర్వహణ
- ప్రగతిని ప్రతిబింబించేలా వర్కింగ్ మోడల్స్, లేజర్ షోల ఏర్పాటు
- కొత్త విద్యుత్ కనెక్షన్లకు త్వరలోనే స్మార్ట్ మీటర్లు..
- రెండు మూడు నెలల్లో వినియోగంలోకి తెస్తాం
- సీఎండీ జితేష్ వి. పాటిల్

2

## తెలంగాణలో 22-ఎ
# సెక్షన్ దుర్వినియోగం



- రాహుల్ గాంధీకి హరీష్ రావు లేఖ

హైదరాబాద్, సిరి న్యూస్:
తెలంగాణలో 22ఎ నిషేధిత జాబితా భూముల సెక్షన్ దుర్వినియోగం జరుగుతోందని బీఆర్ఎస్ నేత, అసెంబ్లీలో

మిగతా 2వ పేజీలో..

# 22-ఎ పేరిట భూ దోపిడీ

- రాష్ట్రంలో నడుస్తున్నది దోపిడీ పాలన
- బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్

2

# కాంగ్రెస్

## ముదురుతున్న రేవంత్ వర్సెస్ 'కొండ' లొల్లి



# సెల్ఫ్ గోల్!

- నాకెందుకు నోటీసులన్న మంత్రి సురేఖ
- సుస్మిత వ్యాఖ్యలపై మంత్రికి షోకాజ్ నోటీసు జారీ చేసిన టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ
- ఉపసంహరించుకోవాలని సురేఖ లేఖ
- రేవంత్ రెడ్డి టికెట్లను అమ్ముకున్నారన్న మాజీ ఎమ్మెల్యే చిన్నారెడ్డి
- ఎప్పటికప్పుడు విమర్శలు గుప్పిస్తున్న రాజగోపాల్ రెడ్డి
- కాంగ్రెస్‌లో ముదురుతున్న అంతర్గత పోరు
- సర్కార్‌పై పెరుగుతున్న పొలిటికల్ ప్రెజర్



తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:
తెలంగాణ కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ కమిటీ మంత్రి కొండా సురేఖ కూతురు కొండా సుస్మిత వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందిస్తూ, మంత్రి సురేఖకు షోకాజ్ నోటీసు జారీ చేయడం సంచలనంగా మారింది. దీనిపై మంత్రి కొండా సురేఖ వెంటనే స్పందిస్తూ క్రమశిక్షణ కమిటీకి లేఖ రాశారు. కొండా సుస్మిత తన కూతురే అయినప్పటికీ, ఆమె చేసిన వ్యాఖ్యలు పూర్తి వ్యక్తిగతమని, ఆ వ్యాఖ్యలతో తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఒక స్వతంత్ర వ్యక్తి చేసిన వ్యాఖ్యలకు నన్ను బాధ్యురాలిని చేయడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని లేఖలో పేర్కొన్నారు. కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీపై తనకు పూర్తి గౌరవం ఉందంటూనే, తనకు జారీ చేసిన షోకాజ్ నోటీసును వెంటనే ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**షోకాజ్ పార్టీ సెల్ఫ్ గోలా?**
కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన షోకాజ్ నోటీసు ఇప్పుడు పార్టీకే 'సెల్ఫ్ గోల్'గా మారిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. కొండా సుస్మితకు పార్టీలో ప్రాథమిక సభ్యత్వం ఉందో లేదో చూడకుండా, ఆమె

మిగతా 2వ పేజీలో..

# విశ్వాసం, పరస్పర సహకారంతో సమస్యల పరిష్కారం

- ఏపీ సీఎం చంద్రబాబు
- హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశం
- హాజరైన తమిళనాడు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి సీఎంలు

2




## రాజీవ్ గాంధీ ఆశయాలతో
# బలమైన భారత్

- సద్భావనతో సమైక్యతే మన శక్తి: సీఎం రేవంత్‌రెడ్డి
- రాజీవ్ గాంధీకి ముఖ్యమంత్రి ఘన నివాళి
- సద్భావనా దినోత్సవం ప్రజలకు స్ఫూర్తిదాయకమన్న సీఎం
- శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రాధాన్యం
- సమానత్వంతో దేశ నిర్మాణానికి పిలుపు
- రాజీవ్ ఆశయాలను కొనసాగించాలని సూచన

3

## రాజీవ్ దార్శనికతతోనే ఆధునిక భారత నిర్మాణం

- శ్రీపెరంబుదూరులో రాజీవ్ డిప్యూటీసీఎం భట్టి నివాళి



3



## కళ్యాణలక్ష్మి, షాదీముబారక్‌పై
# హైకోర్టు ఆగ్రహం

- ఉచిత పథకాలకు చట్టబద్ధ ఆధారం ఏంటని ప్రశ్న
- స్టే ఎత్తివేతకు హైకోర్టు నిరాకరణ
- ప్రభుత్వ జీవోలతో ప్రజాధనం ఖర్చు చేయడంపై ప్రశ్న
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ధర్మాసనం ఆందోళన
- ఆర్టీసీ వంటి సంస్థలను లాభాల్లోకి తేవాలని సూచన
- భూ బాధితులకు పరిహారంపై ప్రభుత్వాన్ని నిలదీత

2



2

## 30శాతం కమీషన్ల వసూళ్లపై జవాబివ్వాలి



## అర్ధరాత్రి బావిలోకి దూసుకెళ్లిన కారు

3



## సమన్వయం, డిజిటల్ వేదికలతో
# సత్వర న్యాయం

- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్
- రాష్ట్ర జ్యుడీషియల్ అకాడమీ, పోలీసు శాఖ సంయుక్త సదస్సు

హైదరాబాద్, ఆగస్టు 20 , సిరి న్యూస్:
కొత్త నేర చట్టాలైన భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధినియమం (బీఎస్ఏ) అమలులో డిజిటల్ వేదికల వినియోగం, వివిధ విభాగాల మధ్య సమన్వయం కీలకమని తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ అన్నారు. న్యాయవ్యవస్థ, పోలీస్, జైళ్లు, ప్రాసిక్యూషన్, ఫోరెన్సిక్, వైద్య విభాగాలతో పాటు ఎన్ఐసీ, ఎన్సీఆర్బీ వంటి సంస్థలను ఒకే వేదికపైకి తీసుకొస్తూ తెలంగాణ రాష్ట్ర జ్యుడీషియల్ అకాడమీ, తెలంగాణ పోలీస్ శాఖ

మిగతా 3వ పేజీలో..

# కొండా సురేఖకు నోటీసుపై వివరణ

- కుమార్తె వ్యాఖ్యలకు నన్ను బాధ్యురాలిని చేయొద్దు: మంత్రి
- మల్లు రవికి సురేఖ లేఖ
- కుమార్తె వ్యాఖ్యలు వ్యక్తిగత అభిప్రాయాలేనని స్పష్టం
- కుటుంబ బంధాలతో రాజకీయ బాధ్యత మోపడం సరికాదని వెల్లడి
- పార్టీ అధిష్ఠానం, క్రమశిక్షణపై పూర్తి గౌరవం
- నోటీసును వెంటనే ఉపసంహరించాలని విజ్ఞప్తి

2



# సుష్మిత వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఆగ్రహం



- సుష్మిత.. జాగ్రత్త అంటూ ఇందిరా శోభన్ హెచ్చరిక

హైదరాబాద్,ఆగస్ట్ 20, సిరి న్యూస్ :
మంత్రి కొండా సురేఖ కుమార్తె సుష్మిత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, పార్టీలోని అంతర్గత పరిణామాలను లక్ష్యంగా చేసుకుని చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. వచ్చే

మిగతా 3వ పేజీలో..



## మిల్లర్లపై చర్యలకు
# రంగం సిద్ధం

ఈడీకి నివేదిక అందచేసిన ప్రభుత్వం

హైదరాబాద్, ఆగస్ట్ 20, సిరి న్యూస్:
ప్రభుత్వ ధాన్యం మిల్లింగ్‌లో బకాయిలను భారీగా ఎగవేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న రైస్ మిల్లర్లపై సివిల్ సప్లయ్

మిగతా 3వ పేజీలో..

# తెలంగాణలో 22-ఎ సెక్షన్ దుర్వినియోగం

**మొదటిపేజీ తరువాయి**

డిప్యూటీ ఫ్లోర్ లీడర్ టి.హరీష్‌రావు ఆరోపించారు. ఈమేరకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి బహిరంగ లేఖ రాశారు. సెక్షన్ 22ఎ నిషేధిత భూముల రిజిస్ట్రేషన్ ఆపడానికి తెచ్చిన చట్టం అని, ప్రైవేటు ఆస్తులపై కృత్రిమ వివాదాలు సృష్టించి వసూళ్లకు పాల్పడటానికి కాదని తెలిపారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ సహా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లో హెచఎండీఏ అనుమతులున్న వేలాది ప్రైవేటు ఆస్తులను ఏకపక్షంగా 22ఎజాబితాలో పెడుతూ వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. రెవెన్యూ శాఖలో 30 శాతం వసూళ్ల రాకెట్ నడుస్తోందని, నిషేధిత జాబితా నుంచి ఆస్తులు తొలగించడానికి దళారులు మార్కెట్ విలువలో ఏకంగా 30% కమీషన్లు డిమాండ్ చేస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. యాదాద్రి జిల్లాలో 40 వేల ఎకరాలను 22A లో పెట్టారని నాలుగు నెలల క్రితమే మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్వయంగా చెప్పినా సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. ఓఆర్ఆర్ చుట్టుపక్కల భూములపై వివాదాలు సృష్టించి రాజకీయ పలుకుబడి ఉన్న బినామీ సంస్థలతో 50:50 జాయింట్ డెవలప్‌మెంట్‌కు ఇవ్వాలని యజమానులపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారన్నారు. ఇంత కుంభకోణం జరుగుతున్నా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్యలు తీసుకోకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. 22ఎపై తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని వెంటనే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఫోరెన్సిక్ ఆడిట్ ద్వారా ఏ ఆస్తిని ఎవరు జాబితాలో చేర్చారు. ఎందుకు తొలగించారు.. మధ్యవర్తుల ప్రమేయం, ఆర్థిక లావాదేవీలపై తక్షణమే నిజాలు తేల్చాలని కోరారు. బినామీ సంస్థలను నడిపిస్తున్న రాజకీయ శక్తులు ఎవరో విచారణలో నిగ్గు తేల్చాలన్నారు. దశాబ్దాల క్రితమే అర్బన్ ల్యాండ్ సీలింగ్ కింద క్రమబద్ధీకరించిన ఆస్తులను, రిజిస్టర్డ్ డాక్యుమెంట్లు ఉన్న భూములను మళ్లీ 22ఎలో పెట్టి స్తంభింపజేయడం దుర్మార్గమన్నారు. జిల్లాల వారీగా 22ఎ జాబితాను పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలన్నారు. ఏ భూమిని ఎప్పుడు చేర్చారు, ఎవరి ఆదేశంతో తీసేశారో ప్రజలకు పారదర్శకంగా తెలియాలని, ఎన్నికల ముందు కాంగ్రెస్ చెప్పిన భూమాత.. భూ రికార్డులకు స్పష్టతనివ్వాలి అన్నారు. ఒక అవినీతి మంత్రిని కాపాడుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని పణంగా పెడుతోందని విమర్శించారు. ఈ దోపిడీపై రాహుల్ గాంధీ వెంటనే జోక్యం చేసుకోకపోతే కాంగ్రెస్ మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ఈ ఆరోపణలపై స్వతంత్ర విచారణకు ఆదేశించి రేవంత్ ప్రభుత్వం తన నిజాయతీని నిరూపించుకోవాలని, లేదంటే బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆరఎస్ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

# 30శాతం కమీషన్ల వసూళ్లపై జవాబివ్వాలి

- **మాజీ మంత్రి తలసాని**

**హైదరాబాద్,సిరి న్యూస్:**

కమీషన్‌ల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం 22 ఏ తీసుకొచ్చిందని బిఆర్ఎస్ నేత, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదల ఇండ్లు, ప్రయివేట్ భూములను 22 ఏ లో చేర్చే అధికారం మీకు ఎవరు ఇచ్చారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 22 ఏను అడ్డం పెట్టుకొని భూముల యజమానులను భయపెట్టి 30 నుండి శాతం కమీషన్లను వసూలు చేసిన మాట వాస్తవం కాదా అని నిలదీశారు. వెస్ట్ మారేడ్ పల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో గురువారం మీడియా సమావేశంలో మాట్లాడారు. ఉద్దేశపూర్వకంగానే ప్రభుత్వం తప్పిదాలు చేసి అధికారులపై నెపం పెట్టి తప్పించుకోవాలని చూస్తున్నదని విమర్శించారు. కరోనా సమయంలో సరిపడా ఆక్సిజన్, బెడ్ లు లేక ఎదురైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని భవిష్యత్ అవసరాల కోసం ముందు చూపుతో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం సనత్ నగర్, అల్వాల్, కొత్తపేట ప్రాంతాలలో కార్పొరేట్ స్థాయి హాస్పిటల్స్ నిర్మాణ పనులు చేపట్టిందని వివరించారు. తమ ప్రభుత్వ హయాంలోనే 60 శాతం పనులు పూర్తయ్యాయనే విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తుపెట్టుకోవాలని హితవు పలికారు. సనత్ నగర్ టిమ్స్‌ను కట్టామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పుకోవడం అవివేకమని విమర్శించారు. హాస్పిటల్ లో అవసరమైన సౌకర్యాలు, వసతులు కల్పించకుండా హడావుడిగా ప్రారంభించాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. హాస్పిటల్ ప్రారంభోత్సవ సభలో అధికారిక కార్యక్రమం అనే సోయి లేకుండా వైద్యులు, నర్సింగ్ విద్యార్థుల ముందు ముఖ్యమంత్రి నోటికొచ్చినట్లు అబద్దాలు మాట్లాడారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి తన భాషను మార్చుకోవాలని, నోటిని అదుపులో పెట్టుకోవాలని శ్రీనివాస్ యాదవ్ హెచ్చరించారు. ప్రజాపాలన అని ఒక వైపు ప్రచారం చేసుకుంటూ మరో వైపు నిర్బంధాలు, అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని విమర్శించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.



## విశ్వాసం, పరస్పర సహకారంతో
# సమస్యల పరిష్కారం

**మహాబలిపురం, ఆగస్టు 20, సిరి న్యూస్:**

హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశం మహాబలిపురంలో జరిగింది. ఈ సమావేశంకు ఏపీ సీఎం చంద్రబాబు, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి సీఎంలు హాజరయ్యారు. సమావేశంలో ఏపీ సహా దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధి గురించి సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. రాష్ట్రాల మధ్య విశ్వాసం, పరస్పర సహకారంతో సమస్యల పరిష్కారం జరగాలని సీఎం సూచించారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఉమ్మడి లాజిస్టిక్స్ నెట్‌వర్క్, డ్రై పోర్టులు ఏర్పాటు చేయాలని సూచించారు. దక్షిణాది విద్యుత్ గ్రిడ్‌ను జాతీయ గ్రిడ్‌తో అనుసంధానించడంతోపాటు దక్షిణాది రాష్ట్రాల యూనివర్సిటీలు, స్కిల్లింగ్ సంస్థలతో ఉమ్మడి కన్సార్టియం ఏర్పాటు చేయాలని స్పష్టం చేసారు.విపత్తుల సమయంలో రాష్ట్రాలు పరస్పరం సహకరించుకునే మ్యూచువల్ ఎయిడ్ ఫోర్స్ ఏర్పాటు ప్రతిపాదించిన చేసారు. తిరుపతి నుంచి కాశీ, అయోధ్య, చార్‌ధామ్ వరకు ఉమ్మడి ఆధ్యాత్మిక పర్యాటక సర్క్యూట్ ఏర్పాటు చేయాలని కోరిన ముఖ్యమంత్రి దేశ జీడీపీలో దక్షిణాది రాష్ట్రాల వాటా సుమారు 31 శాతం ఉందన్నారు. 2047 నాటికి దక్షిణాది ఆర్థిక వ్యవస్థ 10 ట్రిలియన్ డాలర్లకు చేరే అవకాశం ఉందని వెల్లడించారు. వికసిత్ భారత్ నిర్మాణంలో దక్షిణాది కీలక ఆర్థిక శక్తిగా ఎదగాలనీ ప్రసంగంలో పేర్కొన్న సీఎం, విభజన చట్టంలోని షెడ్యూల్ 9, 10 సంస్థలు 12 ఏళ్లుగా ఇంకా విభజనకు నోచుకోలేదనీ వెల్లడించారు. కావేరి నదుల అనుసంధానంతో 500 టీఎంసీలకు పైగా నీటిని మళ్లించే ప్రతిపాదన చేసిన సీఎం, గోదావరి, కావేరి అనుసంధానంతో తమిళనాడు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని వ్యాఖ్యానించారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు కలిసి నదీ జలాలపై సమన్వయంతో ముందుకు సాగాలని కోరారు. గంగా, కావేరి నదుల అనుసంధానానికి దీర్ఘకాలిక జాతీయ ప్రణాళిక అవసరం అన్న చంద్రబాబు, నదుల అనుసంధానంపై కాలపరిమితితో కూడిన డీపీఆర్‌లు, అనుమతులు ఇవ్వాలన్నారు. చంద్రబాబు ప్రసంగాన్ని కొనియాడిన దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు దక్షిణాది రాష్ట్రాల సమగ్రాభివృద్ధి గురించి ఎంతో విజన్ తో మాట్లాడారన్నారు. విశాల దృక్పథంతో అన్ని రాష్ట్రాల అభివృద్ధి గురించి మాట్లాడారని కర్ణాటక సీఎం డీకే శివకుమార్ ప్రశంసించారు.

# కాంగ్రెస్ సెల్ఫ్ గోల్!

**మొదటిపేజీ తరువాయి**

చేసిన వ్యాఖ్యలకు మంత్రి అయిన తల్లికి నోటీసులు ఇవ్వడం ఏంటని గాంధీ భవన్ వర్గాల్లోనే చర్చ నడుస్తోంది. పార్టీలో ప్రభుత్వంపై అనేకమంది నేతలు బహిరంగ విమర్శలు చేస్తున్నప్పటికీ కొందరిపైనే చర్యలు తీసుకోవడం పట్ల బీసీ నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. క్రమశిక్షణ కమిటీ తీసుకున్న ఈ నిర్ణయం వల్ల సమస్య సద్దుమణగకపోగా, కొండా దంపతుల వైపు నుంచి వ్యూహాత్మక నిరసనకు దారితీసిందని తెలుస్తోంది.

**ఓఎస్డీ అరెస్ట్ డ్రామా నాటి నుంచే రగులుతున్న చిచ్చు**

మంత్రి కొండా సురేఖ ఓఎస్డీ అరెస్ట్ సమయంలో జరిగిన హైడ్రామా నాటి నుంచే రేవంత్ రెడ్డి, కొండా దంపతుల మధ్య విభేదాలు పీక్స్‌కు చేరాయి. ఆ సమయంలో మంత్రి ఇంటి వద్దే కొండా సుస్మిత ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఆ తర్వాత మీనాక్షి నటరాజన్ సమక్షంలో వివాదం సద్దుమణిగినట్లు కనిపించినా, దేవాదాయ శాఖలో సీఎం రేవంత్ రెడ్డి నేరుగా నిర్ణయాలు తీసుకోవడంపై సురేఖ వర్గం తీవ్ర అసంతృప్తితో ఉంది. యాదగిరిగుట్ట దేవస్థానం పాలకమండలి నియామకంలో కూడా మంత్రికి కనీస సమాచారం ఇవ్వలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల వరంగల్ పర్యటన సమాచారం కూడా స్థానిక ఎమ్మెల్యే ద్వారానే రావడంతో అవమానంగా భావించిన సురేఖ ఆ సభకు హాజరుకాలేదు.

**పరకాల సీటు పంచాయితీతో..**

వరంగల్ సభలో రాబోయే ఎన్నికల్లో పరకాల అభ్యర్థి రేవూరి ప్రకాష్ రెడ్డేనని ముఖ్యమంత్రి ప్రకటించడం కొండా కుటుంబానికి మింగుడుపడలేదు. దీంతో సురేఖ జన్మదిన వేడుకల సందర్భంగా కొండా సుస్మిత సీఎంపై విరుచుకుపడ్డారు. రేవంత్ రెడ్డికి ముఖ్యమంత్రి కాగానే కళ్ళు నెత్తికెక్కాయా? అని ప్రశ్నిస్తూ, ధైర్యముంటే ఇప్పుడే రాజీనామా చేసి పోటీ చేయాలని ప్రత్యక్ష సవాల్ విసిరారు. తన తండ్రి కొండా మురళి, తల్లి సురేఖల మద్దతు వల్లే రేవంత్ టీపీసీసీ అధ్యక్షుడు అయ్యారని, అలాంటిది పరకాల సీటు విషయంలో హామీ తప్పారని మండిపడ్డారు.

**జగ్గారెడ్డికి ఏఐసీసీ టికెట్ ఇస్తే.. రేవూరికి రేవంత్ ఎలా ఇస్తాడు?**

ముఖ్యమంత్రి సంగారెడ్డిలో జరిగిన సభలో జగ్గారెడ్డి పోటీచేయను అంటున్నాడు. అయన ఎక్కడ పోటీచేయాలో నిర్ణయించేది ఏఐసీసీ పెద్దలు అని సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల తేల్చిచెప్పారు. అదే పరకాల సభలో మాత్రం ఉద్దేశ్యపుర్వకంగానే రేవూరికే టికెట్ అని ఎందుకు చెప్పారని కొండా అనుచరులు ప్రశినిస్తున్నారు. జగ్గారెడ్డికి ఒకలా.. పరకాల సీటు విషయంలో ఇంకోలా ఎలా ఉంటుందని వారు ప్రశ్నిస్తున్నారు.

**గురువు చిన్నారెడ్డి బాంబు**

ఒకవైపు కొండా దంపతుల ధిక్కార స్వరం సంచలనం రేపుతుంటే, సీఎం రేవంత్ రెడ్డికి ఒకప్పుడు గురువుగా ఉన్న వనపర్తి మాజీ ఎమ్మెల్యే చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలు బాంబులా పేలాయి. తనకు దక్కాల్సిన కాంగ్రెస్ టికెట్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డబ్బులకు అమ్ముకున్నారంటూ ఆయన బహిరంగంగా ఆరోపించడం కాంగ్రెస్ పెద్దలను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. సీఎం సొంత జిల్లాకు చెందిన సీనియర్ నేత, సొంత గురువే ఇలా తీవ్ర ఆరోపణలు చేయడం పార్టీ శ్రేణుల్లో పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది. ఎమ్మెల్యే మేఘారెడ్డి వర్గం అధిష్టానానికి ఫిర్యాదు చేసినప్పటికీ, చిన్నారెడ్డికి పార్టీలో మద్దతు పెరగడం రేవంత్‌కు మింగుడుపడటం లేదు.

**రాజగోపాల్ రెడ్డి విమర్శల బాణాలు**

మరోవైపు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సైతం రేవంత్ సర్కార్‌పై విమర్శల బాణాలు విసురుతూనే ఉన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు ఇచ్చే రూ.5 లక్షల బిల్లులకు అధికారులు 500 నిబంధనలు పెడుతున్నారని, పార్టీతో సంబంధం లేని వ్యాపారులకు మాత్రం వేల కోట్లు అప్పనంగా కట్టబెడుతున్నారంటూ రవీంద్రభారతి వేదికగా నిలదీశారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి కూడా రాజగోపాల్ రెడ్డి ఒక అగ్నిపర్వతమని మద్దతు తెలపడం గమనార్హం. ఒకవైపు కొండా సురేఖకు నోటీసుల రగడ, మరోవైపు చిన్నారెడ్డి, రాజగోపాల్ రెడ్డిల బాహాట విమర్శలతో కాంగ్రెస్ పార్టీ తీవ్రమైన అంతర్గత సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది.

## టీజీఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో
# పవర్ ఎగ్జిబిషన్-2026

**హైదరాబాద్, ఆగస్టు 20 (సిరి న్యూస్):**

కొత్తగా విద్యుత్ కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసే వినియోగదారులకు త్వరలోనే స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయబోతున్నట్లు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ జితేష్ వి. పాటిల్ చెప్పారు. రానున్న రెండు, మూడు నెలల్లో వీటిని వినియోగంలోకి తీసుకురానున్నట్లు తెలిపారు. తొలి దశలో కొత్త కనెక్షన్లకు, ఆ తర్వాతి దశలో పాత మీటర్ల స్థానంలో వీటిని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. గురువారం సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడంతో పాటు పక్కాగా బిల్లింగ్ నమోదుకు ప్రస్తుతం ఉన్న ఎలక్ట్రానిక్ ఐఆర్ ఫోర్ట్ మీటర్ల స్థానంలో అత్యాధునిక స్మార్ట్ మీటర్లను ప్రవేశపెట్టబోతున్నట్లు చెప్పారు. జీహెచ్ఎంసీ పరిధిలోని వీధిలైట్లకు ఇచ్చిన కనెక్షన్లు ప్రస్తుతం వేర్వేరు ఫీడర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల (డీటీఆర్) పరిధిలో ఉన్నాయని, దీనివల్ల కొన్నిసార్లు మరమ్మతులు చేసే సమయంలో ప్రమాదాలు జరిగి కార్మికులు మృత్యువాతపడుతున్నారని సీఎండీ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదాలకు చెక్‌పెట్టేందుకు వీధిలైట్ల కనెక్షన్లను ఒకే డీటీఆర్ పరిధిలోకి తీసుకువచ్చేలా డిస్కం వినూత్న ప్రణాళిక సిద్ధం చేసిందని తెలిపారు.

**ఘనంగా టీజీఎస్పీడీసీఎల్ - పవర్ ఎగ్జిబిషన్-2026..**

రాష్ట్ర విద్యుత్ రంగంలో జరుగుతున్న సాంకేతిక, పరిపాలనా సేవల విప్లవాత్మక మార్పులను ప్రజలకు ప్రత్యక్షంగా పరిచయం చేయడమే 'పవర్ ఎగ్జిబిషన్2026' ప్రధాన ఉద్దేశమని జితేష్ వి. పాటిల్ తెలిపారు. ఆగస్టు 22, 23, 24 తేదీలలో హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజాలో మూడు రోజుల పాటు ఈ పవర్ ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. తెలంగాణ విద్యుత్ రంగం గత దశాబ్దంలో సాధించిన ప్రగతి, ప్రస్తుతం అమలు చేస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలు, భవిష్యత్ ప్రణాళికలను ప్రజలకు అందుబాటులో ఉంచనున్నట్లు పేర్కొన్నారు. స్మార్ట్ మీటరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత సేవలు, డిజిటల్ నెట్‌వర్క్ మ్యాపింగ్, వినియోగదారుల సేవల ఆధునీకరణ వంటి అంశాలను ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించనున్నట్లు తెలిపారు. విద్యుత్ అంతరాయాలను ముందుగానే గుర్తించి నివారించే ప్రివెంటివ్ మెయింటెనెన్స్ విధానాలు, పవర్ అంబులెన్స్ సేవలు, రియల్ టైమ్ మానిటరింగ్ విధానాలను ప్రజలకు ప్రత్యక్షంగా చూపించనున్నట్లు చెప్పారు. ఎగ్జిబిషన్‌లో 132కేవీ సబ్‌స్టేషన్ మోడళ్లు, ట్రాన్స్‌ఫార్మర్ల నిర్మాణం, గృహ వైరింగ్ భద్రత, సోలార్ విద్యుత్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్, ఈవీ చార్జింగ్ టెక్నాలజీలను ప్రదర్శించనున్నారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత కోసం వర్కింగ్ మోడల్స్, ఇంటరాక్టివ్ డిస్ప్లేలు ఏర్పాటు చేశామని, ఆధునిక లేజర్ షోలు, సేఫ్టీ డెమోన్స్ట్రేషన్లు ఉంటాయని తెలిపారు. ఎలాంటి బాహ్య సంస్థల సహకారం లేకుండా పూర్తిగా టీజీఎస్పీడీసీఎల్ అధికారులు, సిబ్బందే స్వయంగా ఈ ప్రదర్శనను ఏర్పాటు చేశారని పేర్కొంటూ.. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల ప్రజలు, విద్యార్థులు, ఇంజినీరింగ్ నిపుణులు ఈ ప్రదర్శనను తిలకించాలని ఆయన ఆహ్వానించారు.



# 22-ఎ పేరిట భూ దోపిడీ

**హైదరాబాద్, సిరి న్యూస్ :**

ప్రజల ఆస్తులను కాపాడాల్సిన రెవెన్యూ శాఖ బ్రోకర్‌లా వ్యవహరిస్తూ ప్రజల భూములను లూటీ చేస్తోందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ ఓ ప్రకటనలో ఆరోపించారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇల్లే 22ఎ నిషేధిత జాబితాలోకి ఎక్కిందంటే ఇక రాష్ట్రంలో సామాన్యుడి ఆస్తికి ఏం భద్రత ఉంటుందని ప్రశ్నించారు. పరిస్థితి చేతులు దాటడంతోనే సీఎం స్పందించాల్సి వచ్చిందన్నారు. మంత్రి పొంగులేటి క్షమాపణలు చెప్పారంటేనే ఘోరమైన స్కాం జరిగిందని ప్రభుత్వం స్వయంగా ఒప్పుకున్నట్లేనని, తప్పు చేయనప్పుడు క్షమాపణలు ఎందుకు చెబుతున్నారని నిలదీశారు. రాత్రికి రాత్రే ప్రైవేట్ భూములను 22ఎలోకి మార్చడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని కేబినెట్ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి బాహాటంగా ఒప్పుకుంటున్నారంటే కాంగ్రెస్ సర్కారు లోపల జరుగుతున్న స్కామ్‌ను వాళ్లే బయట పెట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వస్తే ధరణిని బంగాళాఖాతంలో పడేస్తామన్న కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు సామాన్యుడి ఆస్తులనే బంగాళాఖాతంలో ముంచేస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వంలో 22 లక్షల ఎకరాలు వివాదాల్లో ఉన్నాయని నాడు మొసలి కన్నీరు కార్చిన రేవంత్ రెడ్డి ఇప్పుడు అధికారంలోకి వచ్చాక హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ పరిధిలోనే ఏకంగా లక్షల ఎకరాల ప్రైవేటు భూములను 22ఎ చిక్కుల్లోకి నెట్టారన్నారు. ప్రజల ఆస్తులు భద్రంగా ఉండాలంటే ఆర్మీని దింపాల్సి వస్తుందేమోనని హైకోర్టు సైతం మొట్టికాయలు వేసే దుస్థితికి ఈ ప్రభుత్వం దిగజారిందన్నారు. పైసాపైసా కూడబెట్టుకుని కొనుక్కున్న స్థలాలను కాంగ్రెస్ పెద్దల కన్ను పడితే చాలు వివాదాల్లోకి నెట్టి కబ్జా చేయడమే లక్ష్యంగా మారిందని, హైదరాబాద్ చుట్టుపక్కల విలువైన స్థలం కనిపిస్తే చాలు.. రాత్రికి రాత్రే నిషేధిత జాబితాలోకి ఎక్కించి ఆ తర్వాత సెటిల్‌మెంట్లకు తెరలేపుతున్నారని ఆయన ఆరోపించారు. ఆ లిస్టు నుంచి పేరు తీయాలంటే 30% నుండి 40% కమీషన్లు లేదా వాటాలు డిమాండ్ చేస్తూ ప్రజలను, బిల్డర్లను బెదిరిస్తున్నారన్నారు. బడాబాబుల జోలికి వెళ్లకుండా చిన్న ఉద్యోగులు, పేదలు కొనుక్కున్న 60, 100 గజాల ప్లాట్లను 22ఎలో పెట్టి వారి కడుపు కొడుతున్నారని ఆరోపించారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, రెరా అనుమతులు ఉండి, బ్యాంకులు రుణాలు ఇచ్చి, రిజిస్ట్రేషన్ పూర్తయిన ఆస్తులను అకస్మాత్తుగా నిషేధిత జాబితాలో ఎలా పెడతారని లక్ష్మణ్ ప్రశ్నించారు. జూలైలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం దారుణంగా పడిపోయినా సర్కారుకు చీమ కుట్టినట్లయినా లేదని, ప్రభుత్వ ఖజానా కంటే నేతల జేబులు నిండటమే వీరికి ముఖ్యమని వ్యాఖ్యానించారు. పెద్దల భూములను రాత్రికి రాత్రే 22ఎ లిస్టు నుంచి తొలగిస్తూ సామాన్యుడిని నెలలతరబడి ఎందుకు తిప్పుకుంటున్నారని లక్ష్మణ్ నిలదీశారు. నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని హైకోర్టు ఆదేశాలు ఇచ్చినా సామాన్యుల దరఖాస్తులు పరిష్కరించడానికి స్పష్టమైన కాలపరిమితితో కూడిన విధానాన్ని ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే అమలు చేయడం లేదన్నారు. విలువైన ప్రభుత్వ, వక్ఫ్, దేవాదాయ భూములకు సర్వే నంబర్లు మార్చి బై నంబర్లతో అక్రమ రిజిస్ట్రేషన్లు చేస్తూ అనుయాయులకు పంచుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ వచ్చాక 22ఎ జాబితా నుంచి ఎన్ని వేల ఎకరాలు తొలగించారు.. అందులో బడా కంపెనీలు, మంత్రుల బినామీలు ఎవరున్నారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. స్కాం బయటపడగానే అంతా అధికారుల తప్పిదమేనని చేతులు దులుపుకోవాలని చూస్తున్నారన్నారు. మంత్రుల ఆదేశాలు లేకుండానే అధికారులు ఇంత పెద్ద ఎత్తున చేస్తారా.. దొరికిపోగానే పదేళ్లుగా ఉన్న పాత అధికారుల కుట్ర అని చెప్పడం హాస్యాస్పదమని ఆయన అన్నారు. ఆ అధికారులకు కీలక పోస్టింగులు ఇచ్చింది మీ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. ప్రజలు దరఖాస్తులు చేసుకోనవసరం లేదని మంత్రులు మీడియా ముందు చెబుతూ క్షేత్రస్థాయిలో మాత్రం సామాన్యుల రిజిస్ట్రేషన్లను నిలిపివేసి ఆగం చేస్తున్నారన్నారు. అపార్ట్‌మెంట్ ఫ్లాట్లను కూడా నిషేధిత జాబితాలో చేర్చి విక్రయాలు జరగకుండా అడ్డుకుంటున్నారన్నారు.




## కళ్యాణలక్ష్మి, షాదీముబారక్‌పై
# హైకోర్టు ఆగ్రహం

**హైదరాబాద్, సిరి న్యూస్:**

కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలపై దాఖలైన పిటిషన్ల విచారణలో తెలంగాణ హైకోర్టు ప్రభుత్వ తీరుపై తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఈ పథకాల అమలును నిలిపివేస్తూ గతంలో ఇచ్చిన స్టే ఉత్తర్వులను ఎత్తివేయడానికి ధర్మాసనం నిరాకరించింది. 2014 నుంచి అమలవుతున్న ఈ పథకాలకు చట్టబద్ధమైన ఆధారం ఏమిటని ప్రశ్నించిన కోర్టు.. కేవలం ప్రభుత్వ ఉత్తర్వుల ఆధారంగా ప్రజాధనాన్ని ఉచిత పథకాలకు ఖర్చు చేయడం ఎంతవరకు సమంజసమని నిలదీసింది.

**స్టే ఎత్తివేతకు నిరాకరణ**

పథకాలపై ఉన్న స్టేను తొలగించాలని ప్రభుత్వం తరపు న్యాయవాదులు కోరినప్పటికీ హైకోర్టు అందుకు అంగీకరించలేదు. పథకాల అమలుకు సంబంధించిన చట్టబద్ధత, ప్రభుత్వం చేస్తున్న వ్యయం తదితర అంశాలపై స్పష్టత అవసరమని ధర్మాసనం పేర్కొంది.

**ఆర్థిక పరిస్థితిపై ఆందోళన**

రాష్ట్రంలోని ప్రభుత్వ రంగ సంస్థలు, ఇతర కీలక విభాగాలు నిధుల కొరత ఎదుర్కొంటున్న సమయంలో ఉచిత పథకాలకు ప్రజాధనం ఖర్చు చేయడంపై కోర్టు ప్రశ్నలు సంధించింది. రిటైర్డ్ ఉద్యోగులకు జీతాలు, పెన్షన్లు సకాలంలో అందక ఇబ్బందులు ఎదురవుతున్న పరిస్థితులను ప్రస్తావిస్తూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు 'డేంజర్ బెల్స్' మోగిస్తున్నాయని వ్యాఖ్యానించింది.

**సంస్థలను లాభాల్లోకి తేవాలని సూచన**

ప్రజల నుంచి పన్నుల రూపంలో వచ్చిన సొమ్మును నేరుగా ఉచిత పథకాలకు వెచ్చించే బదులు ఆర్టీసీ వంటి ప్రభుత్వ రంగ సంస్థలను ముందుగా లాభాల్లోకి తీసుకురావాలని ధర్మాసనం సూచించింది. ఆయా సంస్థల ద్వారా వచ్చే ఆదాయంతో సంక్షేమ కార్యక్రమాలకు నిధులు సమకూర్చవచ్చని అభిప్రాయపడింది.

**భూ బాధితులపై అసహనం**

భూసేకరణలో భూములు కోల్పోయిన బాధితులకు నష్టపరిహారం చెల్లించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. పరిహారం కోసం బాధితులు ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తోందని పేర్కొంది. ఈ వ్యవహారంలో తప్పుడు అఫిడవిట్ సమర్పించడంపైనా ధర్మాసనం తీవ్రంగా స్పందించింది.

**స్పష్టమైన వివరణ ఇవ్వాలని ఆదేశం**

కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల చట్టబద్ధత, వాటికి కేటాయిస్తున్న బడ్జెట్, నిధుల వినియోగంపై ప్రభుత్వం పూర్తి వివరాలు సమర్పించాలని హైకోర్టు ఆదేశించింది. కేసు తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేసింది.

# సమన్వయం, డిజిటల్ వేదికలతో సత్వర న్యాయం

**మొదటిపేజీ తరువాయి**

సంయుక్తంగా ఈ వినూత్న సదస్సును నిర్వహించాయి. దేశంలోనే తొలిసారిగా కొత్త నేర చట్టాల డిజిటల్ అమలుకు సంబంధించిన అన్ని భాగస్వామ్య సంస్థలను ఒకే వేదికపైకి తీసుకొచ్చిన కార్యక్రమంగా ఇది నిలిచింది. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి చొరవతో నిర్వహించిన ఈ సదస్సులో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1,200 మంది న్యాయాధికారులు, పోలీస్, ప్రాసిక్యూషన్, జైళ్లు, ఫోరెన్సిక్, వైద్య విభాగాల అధికారులు హైబ్రిడ్ విధానంలో పాల్గొన్నారు. సదస్సును ప్రారంభించిన తెలంగాణ రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్, జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ మాట్లాడుతూ.. ''న్యాయం అనేది వివిధ సంస్థలు సమన్వయంతో పనిచేసినప్పుడే సాధ్యమయ్యే సామూహిక ఫలితం'' అని పేర్కొన్నారు. నేరం నమోదైనప్పటి నుంచి దర్యాప్తు, ఫోరెన్సిక్, ప్రాసిక్యూషన్, న్యాయస్థానంలో విచారణ వరకు ప్రతి దశ కీలకమన్నారు. కొత్త నేర చట్టాల అమలులో సంస్థల మధ్య సమన్వయం, సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రతి విభాగం తన బాధ్యతతో పాటు ఇతర విభాగాలు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సదస్సు ఒక్కసారితో ముగిసిపోకుండా నిరంతర సమన్వయానికి నాంది కావాలని ఆకాంక్షించారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన, అందుబాటులో ఉండే న్యాయాన్ని అందించడమే లక్ష్యంగా ఉండాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర జ్యుడీషియల్ అకాడమీ అధ్యక్షురాలు జస్టిస్ మౌషుమి భట్టాచార్య మాట్లాడుతూ కొత్త నేర చట్టాల సమర్థ అమలుకు భాగస్వామ్య సంస్థల మధ్య మెరుగైన సమన్వయం అవసరమన్నారు. సాంకేతిక పరిజ్ఞానం పనిభారాన్ని పెంచకుండా ప్రక్రియలను సులభతరం చేయాలని సూచించారు. ఒకే సమాచారాన్ని పదేపదే నమోదు చేయడం, అసంపూర్తి వివరాలు ఇవ్వడం వల్ల కేసుల పరిష్కారంలో అనవసర జాప్యం జరుగుతోందన్నారు. పోలీస్ స్టేషన్ల నుంచి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే సమయంలో దర్యాప్తు అధికారులు తప్పులు, తప్పుడు కోడింగ్ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇలాంటి తప్పుల వల్ల ప్రాసిక్యూషన్ పరిశీలన ఆలస్యమవుతోందన్నారు. పోలీస్, ప్రాసిక్యూషన్, జైళ్ల శాఖల మధ్య సమాచార మార్పిడి మరింత వేగంగా జరగాలని తెలిపారు. కొంతమంది సిబ్బందికి డిజిటల్ వేదికలపై పూర్తి అవగాహన లేకపోవడం కూడా జాప్యానికి కారణమవుతోందని పేర్కొంటూ, సామర్థ్య పెంపు, డిజిటల్ అక్షరాస్యతపై దృష్టి పెట్టాలని సూచించారు.

డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ కొత్త నేర చట్టాలు గత చట్టాల స్థానంలో కొత్త నిబంధనలు తీసుకురావడం మాత్రమే కాదని, పౌర కేంద్రిత న్యాయం, శాస్త్రీయ దర్యాప్తు, డిజిటల్ ఆధారాలు, ఎలక్ట్రానిక్ రికార్డులు, కాలపరిమితితో కూడిన ప్రక్రియలకు ప్రాధాన్యం ఇచ్చే సమగ్ర మార్పు అని వివరించారు. దర్యాప్తుపై సమర్థవంతమైన పర్యవేక్షణ, డిజిటల్ సమాచారాన్ని పూర్తి, కచ్చితంగా నమోదు చేయడం, నిర్ణీత సమయంలో దర్యాప్తు పూర్తి చేయడం, అందుబాటులో ఉన్న అన్ని డిజిటల్ వేదికలను సమర్థంగా వినియోగించడం అవసరమన్నారు. సదస్సులో మూడు సాంకేతిక సెషన్లు నిర్వహించారు. పాల్గొన్న వివిధ విభాగాల అధికారులు తమ అనుభవాలు, ఆచరణలో ఎదురవుతున్న సమస్యలు, పరిష్కార మార్గాలపై ప్రజెంటేషన్లు ఇచ్చారు. ఐసీజేఎస్, ఈసాక్ష్య, ఆన్‌లైన్‌లో ఎఫ్ఐఆర్, ఛార్జిషీట్ల వినియోగం, ఈసమన్లు, దర్యాప్తు కాలపరిమితులు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సాక్ష్యాల నమోదు, న్యాయ సంహిత కాలపరిమితులు, న్యాయ శ్రుతి మాడ్యూల్, ఫోరెన్సిక్, వైద్య విభాగాల అనుసంధానం, జైళ్ల నిర్వహణ, దర్యాప్తు-ప్రాసిక్యూషన్ సంస్థల మధ్య సమన్వయం వంటి అంశాలపై చర్చించారు. కొత్త నేర చట్టాల అమలు నిరంతర ప్రక్రియ కావడంతో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి అధ్యక్షతన సమన్వయ వ్యవస్థను ఏర్పాటు చేసి, ప్రతి నెలా అమలు తీరుపై సమీక్ష నిర్వహించే అంశాన్ని పరిశీలించాలని డీజీపీ కోరారు. ఈ కార్యక్రమం మరింత సమగ్ర, సాంకేతిక ఆధారిత, పౌర కేంద్రిత న్యాయవ్యవస్థ నిర్మాణానికి తొలి అడుగుగా నిలిచింది. సదస్సుకు చొరవ చూపిన తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, న్యాయమూర్తులకు, తెలంగాణ రాష్ట్ర జ్యుడీషియల్ అకాడమీకి డీజీపీ కృతజ్ఞతలు తెలిపారు. సదస్సులో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ విజయసేనారెడ్డి, జస్టిస్ మాధవీదేవి, జ్యుడీషియల్ అకాడమీ అధ్యక్షురాలు జస్టిస్ మౌషుమి భట్టాచార్య, డీజీపీ సీవీ ఆనంద్, ఎన్‌సీఆర్‌బీ ప్రతినిధి ప్రశున్ గుప్తా, టీజీఎస్ఎఫ్ఎల్‌సీ డైరెక్టర్ శిఖా గోయల్, జైళ్ల శాఖ డీజీ సౌమ్యమిశ్రా, తెలంగాణ జ్యుడీషియల్ అకాడమీ ప్రిన్సిపల్ శ్రీదేవి, సీడీటీఐ డైరెక్టర్ సల్మాన్ తాజ్, డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్, డీజీలు, ఐజీలు, ఎస్పీలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

---

# మంత్రి పొంగులేటి భారీ అవినీతి

- **చర్చకు సవాల్ చేసిన బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి**
- **అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మంత్రి కోసం ఎదురుచూపు**

**హైదరాబాద్, ఆగస్ట్ 20, సిరి న్యూస్:**

రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి భారీ అవినీతికి తెరలేపారని బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. మంత్రి అవినీతికి సంబంధించి అన్ని ఆధారాలు తన వద్ద ఉన్నాయని చెప్పారు. దీనిపై సీబీఐతో విచారణ జరిపించాలని, హౌస్ కమిటీ వేయాలని ఆయన డిమాండ్ చేశారు. అవినీతిపై చర్చకు సిద్ధమా? అంటూ మంత్రి శ్రీనివాస రెడ్డికి బుధవారం సవాల్ చేశారు. తన సవాల్‌ను స్వీకరిస్తే అసెంబ్లీ మీడియా పాయింట్‌కు రావాలని కోరారు. ఈ మేరకు గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్‌కు ఏలేటి చేరుకున్నారు. ఈ సందర్భంగా తన సవాల్‌పై చర్చకు రావాలని మంత్రిని ఏలేటి మరోసారి డిమాండ్ చేశారు. తాను మధ్యాహ్నం 2 గంటల వరకు ఇక్కడే ఉంటానని, శ్రీనివాస రెడ్డి రావాలని డెడ్ లైన్ విధించారు. ఈ సందర్భంగా భూభారతి, 22ఏలో అక్రమాలు జరిగాయని ఆయన ఆరోపించారు. ఫీనిక్స్, రాఘవ కన్‌స్ట్రక్షన్ సంస్థలకు భూ బదలాయింపులు జరిగాయన్నారు. ప్రభుత్వ, ప్రజల భూములను లాక్కున్నారని మహేశ్వర్ రెడ్డి మండిపడ్డారు. పొంగులేటి వచ్చి వివరణ ఇచ్చే వరకు తాను కదిలేది లేదని తేల్చి చెప్పారు. దీనిపై సీఎం రేవంత్ రెడ్డి వివరణ ఇస్తారా లేక పొంగులేటి ఇస్తారా అంటూ సూటిగా ప్రశ్నించారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌కు ఎవరొచ్చినా సరే తన వద్ద ఉన్న ఆధారాలను అందిస్తానని ఆయన స్పష్టం చేశారు.

---

# ఐఎస్ఐ ఉగ్ర నెట్‌వర్క్

- **హైదరాబాద్‌లో కలకలం**
- **షహజాద్ భట్టి ముఠాతో సంబంధాలున్న ఇద్దరి అరెస్టు**
- **సోషల్ మీడియా ద్వారా యువతకు వల**
- **ఎన్‌క్రిప్టెడ్ చాటింగ్‌పై నిఘా**
- **మేడ్చల్, యూసుఫ్‌గూడలో ఇద్దరి అరెస్ట్**
- **14 రాష్ట్రాల్లో 253 మంది అదుపులో**
- **ఆర్థిక లావాదేవీలపై దర్యాప్తు ముమ్మరం**

**హైదరాబాద్, ఆగస్టు 21, సిరి న్యూస్:**

పాకిస్థాన్‌కు చెందిన ఐఎస్ఐ మద్దతుతో పనిచేస్తున్నట్లు అనుమానిస్తున్న గ్యాంగ్‌స్టర్ షహజాద్ భట్టి టెర్రర్ నెట్‌వర్క్‌కు హైదరాబాద్‌తో సంబంధాలు ఉన్నట్లు దర్యాప్తులో వెలుగు చూడటం కలకలం రేపుతోంది. దేశవ్యాప్తంగా నిశ్శబ్ద విధ్వంసానికి కుట్రలు పన్నుతున్న ఈ నెట్‌వర్క్‌పై కేంద్ర నిఘా వర్గాలు, వివిధ రాష్ట్రాల పోలీసులు సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్‌లో తెలంగాణకు చెందిన ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు.

**సోషల్ మీడియా ద్వారా వల**

షహజాద్ భట్టి సామాజిక మాధ్యమాల్లో రీల్స్, వీడియోల ద్వారా యువతను ఆకర్షిస్తున్నట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. తన పోస్టులకు స్పందించే యువకులను సంప్రదించి, వారిని నెట్‌వర్క్‌లోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు అనుమానిస్తున్నారు. డబ్బు, ఇతర ప్రలోభాలతో దేశ వ్యతిరేక కార్యకలాపాలకు వినియోగించినట్లు అధికారులు భావిస్తున్నారు.

**మేడ్చల్, యూసుఫ్‌గూడలో అరెస్టులు**

హైదరాబాద్‌లోని నెట్‌వర్క్ కార్యకలాపాలపై నిఘా పెట్టిన కేంద్ర వర్గాలు నగర పోలీసుల సహకారంతో దాడులు నిర్వహించాయి. మేడ్చల్‌కు చెందిన జాయిద్ ఖాన్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఐఎస్ఐ అనుకూల వ్యక్తులతో అతడు ఎన్‌క్రిప్టెడ్ చాటింగ్ చేసినట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం. గత రెండు, మూడు నెలలుగా అతడి కదలికలపై నిఘా కొనసాగించినట్లు తెలుస్తోంది. ఇదే నెట్‌వర్క్‌తో సంబంధాలున్నట్లు అనుమానిస్తున్న యూసుఫ్‌గూడకు చెందిన మరో యువకుడిని కూడా అరెస్టు చేశారు.

**14 రాష్ట్రాల్లో 253 మంది అదుపులో**

నెట్‌వర్క్ కార్యకలాపాలను ఛేదించేందుకు దేశవ్యాప్తంగా 14 రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ చర్యల్లో 253 మందిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. తెలంగాణలో ఇద్దరు పట్టుబడ్డారు. నిందితుల విచారణ కొనసాగుతుండటంతో ఉగ్ర కుట్రలు, ఆర్థిక లావాదేవీలు, నగరంలో వారికి సహకరిస్తున్న ఇతర వ్యక్తుల వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

**భట్టి గత చరిత్రపై ఆరా**

పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌కు చెందిన షహజాద్ భట్టి గతంలో దోపిడీలు సహా పలు నేరాల్లో పాల్గొన్నట్లు దర్యాప్తు సంస్థలు పేర్కొంటున్నాయి. అనంతరం లాహోర్ నేర ప్రపంచంలో అతడి పేరు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. 2013లో అతడిపై పలు కేసులు నమోదైనట్లు తెలుస్తోంది. ఆ తర్వాత పాకిస్థాన్ నుంచి యూఏఈకి వెళ్లిన భట్టి వ్యాపారాలు నిర్వహించినట్లు ప్రచారం చేసుకున్నాడు.

**సోషల్ మీడియానే అడ్డాగా?**

టిక్‌టాక్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి వేదికల ద్వారా భట్టి తన పరిచయ వర్గాన్ని విస్తరించుకున్నట్లు దర్యాప్తు సంస్థలు అనుమానిస్తున్నాయి. మతపరమైన, జాతీయవాద, వివాదాస్పద అంశాలపై వీడియోలు, పోస్టులు చేస్తూ పెద్ద సంఖ్యలో అనుచరులను సంపాదించుకున్నట్లు చెబుతున్నాయి. ఈ ప్రభావాన్ని ఉపయోగించి యువతను ఆకర్షించి, రహస్యంగా ఐఎస్ఐ నెట్‌వర్క్ కోసం పనిచేసినట్లు దర్యాప్తు సంస్థలు అనుమానిస్తున్నాయి.

---

# ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం రాజీ లేని పోరు

**కరీంనగర్, ఆగస్టు 20 :**

ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడితే రేవంత్ రెడ్డి సర్కార్ మెడలు వంచుతామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు తీవ్రస్థాయిలో హెచ్చరించారు. రాష్ట్రంలోని విద్యార్థి లోకం ఎదుర్కొంటున్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీజేవైఎం ఆధ్వర్యంలో కరీంనగర్‌లో బుధవారం నిర్వహించిన ఫీజు బకాయి - బీజేపీ లడాయి మహా ధర్నా కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రామచందర్ రావు ముఖ్య అతిథిగా హాజరై దిశానిర్దేశం చేశారు. ఎన్నికల ముందు సంక్షేమ రాజ్యం తెస్తామని చెప్పి గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి హయాంలో ప్రభుత్వం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని మండిపడ్డారు. గత ప్రభుత్వం సుమారు రూ.8 వేల కోట్ల ఫీజు బకాయిలు పెడితే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా నిధులు విడుదల చేయకుండా నిర్లక్ష్యం వహిస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందని ఆయన మండిపడ్డారు. హైకోర్టు మొట్టికాయలు వేయడంతోనే రూ.2 వేల కోట్లు అడ్వాన్స్‌గా ఇస్తామని కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నారని, అయితే ఇప్పటివరకు పైసా కూడా విడుదల చేయలేదని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 20 లక్షల మంది విద్యార్థులు ఫీజు బకాయిల కోసం ఎదురు చూస్తున్నారని, కాలేజీ యాజమాన్యాలకు నిధులు అందక అధ్యాపకులకు జీతాలు ఇవ్వలేక విద్యాసంస్థలు మూతపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజులు చెల్లించలేక విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆర్థిక, మానసిక క్షోభను అనుభవిస్తున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో రాహుల్ గాంధీ ఇచ్చిన 'యూత్ డిక్లరేషన్' హామీలు గాలికి కొట్టుకుపోయాయని, కాంగ్రెస్ పార్టీ వలసవాద ఆలోచనా ధోరణితో వ్యవహరిస్తూ విద్యార్థుల భవిష్యత్తును విస్మరిస్తోందని విమర్శించారు. ఫీజు బకాయిలను సాధించే వరకు విద్యార్థుల పక్షాన బీజేపీ పోరాడుతూనే ఉంటుందని రామచందర్‌రావు స్పష్టం చేశారు. బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ కుందే మాట్లాడుతూ విద్యార్థుల హక్కుల సాధనకు, స్కాలర్‌షిప్‌ల విడుదల కోసం నెల రోజులుగా బీజేవైఎం క్షేత్రస్థాయిలో అలుపెరగని పోరాటం చేస్తోందని తెలిపారు. విద్యార్థుల ఆందోళనలను చూసి భయపడి కాలేజీ యాజమాన్యాలకు, విద్యార్థులకు పోలీసులు నోటీసులు జారీ చేయడం దుర్మార్గమని అన్నారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే కలెక్టరేట్లను ముట్టడించి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వెంటనే ఫీజు బకాయిలు, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని, లేనిపక్షంలో సీఎం రేవంత్.. తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

---

# సుష్మిత వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఆగ్రహం

**మొదటిపేజీ తరువాయి**

శాసనసభ ఎన్నికల్లో పరకాల నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు తనకు పూర్తి అర్హతలు ఉన్నాయని, కాంగ్రెస్ పార్టీ టికెట్ ఆశిస్తున్నట్లు సుష్మిత బహిరంగంగా ప్రకటించారు. పార్టీ స్థాపన, అభివృద్ధిలో తమ కుటుంబం చేసిన త్యాగాలను వివరిస్తూ తమకు జరుగుతున్న అన్యాయంపై మౌనంగా ఉండేది లేదని స్పష్టం చేశారు. అవసరమైతే ఏ స్థాయికైనా వెళ్లి పోరాడతానని సీఎం వర్గానికి, పార్టీ నాయకత్వానికి ఆమె స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. ఈ వ్యాఖ్యలు సొంత పార్టీలోనే కాక రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపాయి. తాజాగా దీనిపై గాంధీ భవన్‌లో కాంగ్రెస్ మహిళా నేతలు ఏర్పాటు చేసిన డియా సమావేశంలో కాంగ్రెస్ నేత ఇందిరా శోభన్, కొండా సుష్మితపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. 'సుష్మితా.. మాటలు జాగ్రత్త' అంటూ హెచ్చరించిన ఆమె సుష్మిత వైఖరిని, ప్రవర్తనను పూర్తిగా తప్పుబట్టారు. కొండా సురేఖ తమ అక్క కాబట్టి ఆ బంధాన్ని గౌరవిస్తూనే సుష్మితకు అక్క కూతురిగా మర్యాద ఇస్తున్నామన్నారు. అయితే అసలు సుష్మిత పార్టీలో ఉందా లేదా అన్నది స్పష్టం చేయాలన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యేల గురించి ముఖ్యమంత్రి మాట్లాడకపోతే ఇంకెవరి గురించి మాట్లాడతారని ప్రశ్నిస్తూ పార్టీ లైన్‌లో ఉండి పని చేయడం నేర్చుకోవాలని హితవు పలికారు. సుష్మిత తీరు ఆమె తల్లిదండ్రుల పెంపకాన్నే ప్రశ్నించేలా ఉందని ఇందిర వ్యాఖ్యానించారు. సినిమాలు చూసి డ్యామేజీ డైలాగులు కొట్టడం రాజకీయాల్లో నడవదని స్పష్టం చేశారు. సుష్మిత వెనక ఉండి బీఆర్ఎస్ లేదా బీజేపీ నేతలు ఇలా మాట్లాడిస్తున్నారనే అనుమానాన్ని వ్యక్తం చేశారు. మంత్రి పదవి తన తల్లికి దక్కిందంటే అది ఆమె కుటుంబానికి, సామాజిక వర్గానికి వచ్చిన గౌరవమే కదా అని గుర్తు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి కుటుంబానికి సంబంధించిన వారికి ఏ పదవులు లేకపోయినా వారిని వివాదాల్లోకి లాగడం సరికాదన్నారు. గతంలోనే సురేఖ ఒకసారి క్షమాపణలు చెప్పారని, ఇప్పుడు మళ్లీ ఇలాంటి వివాదాలు సృష్టించడం వల్ల పక్క పార్టీలకే అవకాశం ఇచ్చినట్లవుతుందని మండిపడ్డారు. ఎవరిపైన అయినా చిట్టా ఉంటే దానిని దర్యాప్తు సంస్థలకు ఇవ్వాలని, బెదిరింపులకు దిగకూడదని సూచించారు. పొలిటికల్ మెచ్యూరిటీ లేకుండా మాట్లాడుతున్నావంటూ రేవంత్ రెడ్డి అభిమానులు ఇలాంటి వ్యాఖ్యలను చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. కౌంటర్ ఇస్తే మరింత రెచ్చిపోతానని సుష్మిత అంటున్నారని, అలా రెచ్చిపోతే నష్టపోతావని గట్టిగా హెచ్చరించారు. పార్టీ కోసం ఎంతో కష్టపడిన కార్యకర్తలకు పదవులు అడగాలి తప్ప, తనేం చేసిందని ఎమ్మెల్యే పదవి కోరుతోందో చెప్పాలన్నారు. ఇకనైనా సుష్మిత ప్రవర్తన మార్చుకోవాలని హితవు పలికారు.

---

# రాజీవ్ గాంధీ ఆశయాలతో బలమైన భారత్

**హైదరాబాద్, ఆగస్టు 20, సిరి న్యూస్:**

మాజీ ప్రధానమంత్రి, భారతరత్న రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఆయనకు ఘన నివాళులర్పించారు. దేశంలో శాంతి, సౌభ్రాతృత్వం, మత సామరస్యం, ఐక్యతను పెంపొందించాలనే సందేశంతో నిర్వహించే సద్భావనా దినోత్సవం ప్రజలందరికీ స్ఫూర్తినిస్తుందని సీఎం పేర్కొన్నారు.

**సీఎం రేవంత్‌రెడ్డి నివాళి**

రాజీవ్ గాంధీని ఆధునిక భారత నిర్మాతగా పేర్కొంటూ ఆయన దేశానికి చేసిన సేవలను ముఖ్యమంత్రి స్మరించుకున్నారు. దేశ ఐక్యత, అభివృద్ధి కోసం రాజీవ్ గాంధీ చూపిన మార్గం నేటికీ ఆదర్శప్రాయమని అన్నారు.

**సద్భావనే మన ప్రగతి**

'సమైక్యతే మన శక్తి-సద్భావనే మన ప్రగతి' అనే స్ఫూర్తితో ముందుకు సాగాలని సీఎం పిలుపునిచ్చారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, మత సామరస్యాన్ని బలోపేతం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

**బలమైన భారత్ కోసం**

రాజీవ్ గాంధీ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని శాంతి, సౌభ్రాతృత్వం, సమానత్వంతో కూడిన బలమైన భారతదేశ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు.

---

# రాజీవ్ దార్శనికతతోనే ఆధునిక భారత నిర్మాణం

**శ్రీపెరంబుదూరు, ఆగస్ట్ 20, సిరి న్యూస్ :**

దివంగత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా తమిళనాడులోని శ్రీపెరంబుదూరులో ఉన్న రాజీవ్ గాంధీ మెమోరియల్ వద్ద కర్నాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఘన నివాళులు అర్పించారు. దేశ నిర్మాణంలో రాజీవ్ గాంధీ అందించిన సేవలను ఈ సందర్భంగా ఆయన స్మరించుకున్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. రాజీవ్ గాంధీ తన దార్శనికత, ఆధునిక ఆలోచనలతో భారతదేశాన్ని 21వ శతాబ్దం వైపు నడిపించారని అన్నారు. ముఖ్యంగా సాంకేతిక, టెలికాం రంగాల్లో విప్లవాత్మక మార్పులకు ఆయన పునాది వేశారని పేర్కొన్నారు. కంప్యూటర్లు, ఐటీ రంగాల అభివృద్ధికి ఆయన తీసుకున్న నిర్ణయాలు నేటి డిజిటల్ భారత నిర్మాణానికి బలమైన పునాదిగా నిలిచాయని అన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, టెలికాం రంగాన్ని గ్రామస్థాయి వరకు విస్తరించేందుకు, రాజీవ్ గాంధీ కృషి చేశారని భట్టి విక్రమార్క తెలిపారు. విద్యా రంగానికి రాజీవ్ గాంధీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇచ్చిందని భట్టి విక్రమార్క తెలిపారు. 1986లో జాతీయ విద్యా విధానాన్ని తీసుకురావడంతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభావంతులైన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. సాంకేతికత, విద్య, ప్రజాస్వామ్యం, స్థానిక పాలన వంటి కీలక రంగాల్లో రాజీవ్ గాంధీ చేపట్టిన సంస్కరణలు ఆధునిక భారతదేశ నిర్మాణంలో చిరస్థాయిగా నిలిచిపోయాయని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు.

---

# మిల్లర్లపై చర్యలకు రంగం సిద్ధం

**మొదటిపేజీ తరువాయి**

శాఖ చర్యలకు సిద్ధమవుతోంది. ప్రభుత్వానికి భారీ మొత్తంలో బకాయిపడిన 20 మంది రైస్ మిల్లర్ల జాబితాను సివిల్ సప్లయ్ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కి అందజేసినట్లు సమాచారం. ప్రభుత్వానికి చెల్లించాల్సిన ధాన్యం బకాయిలను మిల్లర్లు ఉద్దేశపూర్వకంగా నిలిపివేసినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. అంతేకాక ధాన్యం లావాదేవీల్లో అక్రమ మార్గాల్లో నిధులు సమీకరించడం.. హవాలా రూపంలో డబ్బులు సంపాదించడం వంటి ఆరోపణలు కూడా మిల్లర్లపై ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ఆయా మిల్లర్ల ఆస్తులు, బ్యాంకు లావాదేవీలు, ఆర్థిక వ్యవహారాలు, ధాన్యం కొనుగోళ్లు.. మిల్లింగ్‌కు సంబంధించిన రికార్డులపై సమగ్రంగా దర్యాప్తు చేయాలని ఈడీకి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ప్రభుత్వ ధాన్యం బకాయిలను చెల్లించకుండా తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్న మిల్లర్లపై కఠిన చర్యలకు పోలీస్ శాఖ కూడా సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. మొత్తం తొమ్మిది మంది రైస్ మిల్లర్లపై పీడీ యాక్ట్ ప్రయోగించే దిశగా నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వానికి చెల్లించాల్సిన బకాయిల విషయంలో పలుమార్లు నోటీసులు ఇచ్చినా స్పందించకపోవడం, బకాయిలను భారీగా పెండింగ్‌లో ఉంచడం, ఆర్థిక అక్రమాలకు పాల్పడినట్లు అనుమానాలు ఉండటంతో ఈ చర్యలకు అధికారులు సిద్ధమైనట్లు భావిస్తున్నారు.

---

# అర్ధరాత్రి బావిలోకి దూసుకెళ్లిన కారు

**సిద్దిపేట, ఆగస్ట్ 20, సిరి న్యూస్:**

సిద్దిపేట జిల్లాలో తీవ్ర విషాదం చోటుసుకుంది. కారు అదుపుతప్పి రహదారి పక్కనే ఉన్న వ్యవసాయ బావిలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాదకర సంఘటన సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం అప్పనపల్లి శివారులో అర్ధరాత్రి చోటు చేసుకుంది. దుబ్బాక మండలంలోని బలవంతాపూర్ గ్రామానికి చెందిన దండుగుల రాజు (30), అతని భార్య భాగ్య (25), కుమారుడు నిహాన్ష్ (4), కుమార్తె శాన్విక (2)తో కలిసి సిద్దిపేట నుంచి తమ స్వగ్రామానికి కారులో వస్తుండగా బుధవారం అర్ధరాత్రి సమయంలో అదుపుతప్పి బావిలో పడిపోయారు. స్థానికుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది జేసీబీ సహాయంతో బావిలో నుంచి కారును, నలుగురి మృతదేహాలను వెలికితీశారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం దుబ్బాక ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు దర్యాప్తు చేపట్టారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు దుర్మరణం చెందడంతో బలవంతాపూర్, అప్పనపల్లి గ్రామాల్లో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.

---

# కొండా సురేఖకు నోటీసుపై వివరణ

**హైదరాబాద్, ఆగస్టు 21, సిరి న్యూస్:**

టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ జారీ చేసిన నోటీసుపై రాష్ట్ర మంత్రి కొండా సురేఖ వివరణ ఇచ్చారు. క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవికి రాసిన లేఖలో తన వైఖరిని స్పష్టం చేశారు. ఇటీవల తన కుమార్తె కొండా సుష్మిత పటేల్ చేసిన వ్యాఖ్యలతో తనకు ఎలాంటి సంబంధం లేదని, అవి పూర్తిగా ఆమె వ్యక్తిగత అభిప్రాయాలని పేర్కొన్నారు.

**కుమార్తె వ్యాఖ్యలు వ్యక్తిగతం**

కుటుంబ బంధాల కారణంగా ఒకరు చేసిన వ్యాఖ్యలకు మరొకరిని రాజకీయంగా బాధ్యులను చేయడం సరికాదని సురేఖ పేర్కొన్నారు. తన కుమార్తె వ్యక్తం చేసిన అభిప్రాయాలకు తనను బాధ్యురాలిని చేయడం న్యాయసూత్రాలకు విరుద్ధమని లేఖలో వివరించారు.

**పార్టీపై పూర్తి గౌరవం**

కాంగ్రెస్ పార్టీ నాయకత్వం, అధిష్ఠానం నిర్ణయాలు, పార్టీ క్రమశిక్షణ నియమావళిపై తనకు సంపూర్ణ గౌరవం ఉందని మంత్రి స్పష్టం చేశారు. పార్టీ నిర్ణయాలను, క్రమశిక్షణను తాను ఎప్పుడూ గౌరవిస్తానని పేర్కొన్నారు.

**తన ప్రమేయం లేదని వెల్లడి**

వివాదాస్పద వ్యాఖ్యల వ్యవహారంలో తనకు ఎలాంటి ప్రమేయం లేదని సురేఖ తెలిపారు. ఈ విషయాన్ని క్రమశిక్షణ కమిటీ పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. తన ప్రమేయం లేని అంశంలో తనకు నోటీసు జారీ చేయడం సరికాదని పేర్కొన్నారు.

**నోటీసు ఉపసంహరణకు విజ్ఞప్తి**

కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయడం తగదని పేర్కొంటూ జారీ చేసిన నోటీసును వెంటనే ఉపసంహరించుకోవాలని క్రమశిక్షణ కమిటీని మంత్రి కొండా సురేఖ కోరారు. తన వివరణను పరిగణనలోకి తీసుకుని ఈ అంశాన్ని ముగించాలని విజ్ఞప్తి చేశారు.

# మహిళ కడుపులో గ్లౌజ్‌లు, పేపర్ వైప్స్

- **ప్రసవం కోసం వెళ్లినపుడు నిర్లక్ష్యంగా సర్జరీ**

**ముంబై, ఆగస్టు 20, సిరి న్యూస్ :**



ప్రసవం కోసం హాస్పిటల్‌కు వెళ్లిన 19 ఏళ్ల మహిళకు డాక్టర్ల నిర్లక్ష్యం శాపంగా మారింది. ఆపరేషన్ చేసిన తర్వాత గ్లౌజ్‌లు, పేపర్ వైప్స్ ఆమె కడుపులోనే వదిలేసి కుట్లు వేశారు. ఈ ఘటన మహారాష్ట్రలో కలకలం రేపింది. తీవ్ర కడుపు నొప్పి, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న మహిళ పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉంది. ఈ ఘటనపై ఆరోగ్య శాఖ విచారణకు ఆదేశించింది. వడ్వాణి గ్రామానికి చెందిన సంధ్య ఈనెల 1న ప్రసవం కోసం బీడ్ జిల్లా హాస్పిటల్‌లో చేరారు. అదే రోజు సాయంత్రం ఆమెకు ఆపరేషన్ చేశారు. నాలుగు రోజుల తర్వాత ఆమెను డిశ్చార్జ్ చేశారు. అయితే ఇంటికి వెళ్లిన కొద్ది రోజులకే ఆమెకు తీవ్రమైన కడుపునొప్పి, ఇతర ఆరోగ్య సమస్యలు ప్రారంభమయ్యాయి. ఆరోగ్యం క్రమంగా క్షీణించడంతో కుటుంబ సభ్యులు ఆమెను ఓ □పైవేటు హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. అక్కడ స్కానింగ్‌లో ఆమె కడుపులో ఏవో వస్తువులు ఉన్నట్లు గుర్తించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఆమెను పుణెలోని సాసూన్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ వైద్యులు మరోసారి శస్త్రచికిత్స నిర్వహించి, ఆమె కడుపులో ఉన్న గ్లౌజులు, పేపర్ వైప్స్ ఉన్నట్లు గుర్తించి వాటిని తొలగించారు. తన భార్య పరిస్థితికి మొదటి ఆపరేషన్‌లో జరిగిన నిర్లక్ష్యమే కారణమని సంధ్య భర్త సూరజ్ గైక్వాడ్ ఆరోపించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో ప్రత్యేక విచారణ కమిటీని ఏర్పాటు చేశారు.

# వందేమాతరంపై రాజకీయ వివాదం

- **కాంగ్రెస్ తీరును ఎండగట్టిన బీజేపీ**
- **కొత్త ముస్లింలీగ్ పార్టీ అంటూ నబీన్ విమర్శలు**

**న్యూఢిల్లీ, ఆగస్టు 20 :**



జాతీయ గేయం వందే మాతరం ఆలాపన విషయంలో కాంగ్రెస్, బీజేపీ మధ్య రాజకీయ వివాదం మరింత ముదిరింది. పార్టీ కార్యక్రమాల్లో వందే మాతరంలోని తొలి రెండు చరణాలను మాత్రమే ఆలపించాలన్న తమ 1937 నాటి నిర్ణయానికే కట్టుబడి ఉంటామని కాంగ్రెస్ స్పష్టం చేసింది. కాంగ్రెస్ నిర్ణయాన్ని బీజేపీ తీవ్రంగా తప్పుబట్టింది. ఈ నిర్ణయం ఆ పార్టీ దేశ భక్తి, దేశం పట్ల విధేయతపై ప్రశ్నలు లేవనెత్తుతోందని ఆరోపించింది. ఓట్ల కోసం కాంగ్రెస్ కొత్త ముస్లిం లీగ్‌గా మారిందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఆరోపించారు. ఈమేరకు ఆయన 'ఎక్స్'లో తీవ్రస్థాయిలో స్పందించారు. వందేమాతరాన్ని అవమానించడం అంటే దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను అవమానించడమేనని మండిపడ్డారు. 1937లో కాంగ్రెస్ తీసుకున్న తీర్మానాన్ని అనుసరించాలని, ఇకపై పార్టీ కార్యక్రమాల్లో వందేమాతరం తొలి రెండు చరణాలను మాత్రమే ఆలపించాలని సీడబ్ల్యూసీ బుధవారం తీసుకున్న నిర్ణయాన్ని ఆయన తప్పుబట్టారు. ఈనెల 15న కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో వందేమాతరం పూర్తి రూపాన్ని ఆలపించే విషయంలో చోటు చేసుకున్న వివాదాన్ని నబీన్ పరోక్షంగా ప్రస్తావించారు. వందేమాతరంపై తన వైఖరిని కాంగ్రెస్ తీర్మానం రూపంలో అధికారికం చేసిందన్నారు. ఓటు బ్యాంకు కోసం దేశ ఆత్మగౌరవాన్ని కాంగ్రెస్ పదేపదే తాకట్టు పెడుతోందని ఆరోపించారు. ఇది కేవలం రాజకీయ సమర్థన కాదని, ఓటు బ్యాంకు రాజకీయాలకు నిదర్శనమని పేర్కొన్నారు. జాతీయ అధికార ప్రతినిధి సుధాంశు త్రివేది మాట్లాడుతూ వందే మాతరం విషయంలో కాంగ్రెస్ వైఖరి ఆ పార్టీ దేశ భక్తి, దేశం పట్ల విధేయతపై ప్రశ్నలు లేవనెత్తుతోందని విమర్శించారు. స్వాతంత్ర్య ఉద్యమానికి తామే వారసులమని చెప్పుకునే కాంగ్రెస్ ఇప్పుడు జాతీయ గేయాన్ని పూర్తిగా గౌరవించేందుకు ఎందుకు సిద్ధంగా లేదని ప్రశ్నించారు. రాజ్యాంగం, పార్లమెంట్, దేశం కంటే పార్టీ నిర్ణయానికే కాంగ్రెస్ ఎక్కువ ప్రాధాన్యం ఇస్తోందని ఆరోపించారు. పలువురు బీజేపీ నేతలు కాంగ్రెస్‌ను తీవ్ర పదజాలంతో విమర్శించారు. కాంగ్రెస్ తీరు చారిత్రక ముస్లిం లీగ్ వైఖరిని గుర్తుకు తెస్తోందని, ఆ పార్టీ కొత్త ముస్లిం లీగ్‌గా మారిందని ఆరోపించారు. 1931లో వందే మాతరం పూర్తి రూపంపై ముస్లిం లీగ్ అభ్యంతరాలు వ్యక్తం చేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ ప్రస్తుత కాంగ్రెస్ నిర్ణయం కూడా అదే తరహా మొండితనాన్ని ప్రతిబింబిస్తోందని బీజేపీ విమర్శించింది.

# రాజీవ్ గాంధీకి కాంగ్రెస్ ఘన నివాళి

- **వీర్ భూమి వద్ద నివాళి అర్పించిన సోనియా కుటుంబం**
- **ఎక్స్ వేదికగా రాజీవ్‌ను స్మరించుకున్న ప్రధాని మోదీ**

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 20, సిరి న్యూస్:**

మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేతలు గురువారం ఘన నివాళులు అర్పించారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ సహా పలువురు నేతలు ఆయనకు అంజలి ఘటించారు. వారంతా రాజీవ్ గాంధీ స్మారక చిహ్నమైన వీర్ భూమిని సందర్శించి నివాళులర్పించారు. కార్యక్రమానికి సంబంధించిన వీడియోను 'ఎక్స్'లో కాంగ్రెస్ పార్టీ షేర్ చేసింది. ఈ సందర్భంగా ఆధునిక భారత దేశ నిర్మాణంలో రాజీవ్ గాంధీ కృషి ఎప్పటికీ స్మరించబడుతుందని కాంగ్రెస్ పేర్కొంది. అలాగే, దేశవ్యాప్తంగా ఉన్న ఆ పార్టీ శ్రేణులు నేడు మాజీ ప్రధాని జయంతిని ఘనంగా నిర్వహించారు. రాజీవ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. మరోవైపు రాజీవ్ గాంధీకి ప్రధాని నరేంద్ర మోదీ కూడా నివాళులర్పించారు. సద్భావనా దివస్ సందర్భంగా ఆయనను మోదీ స్మరించుకున్నారు. 'భారత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులు' అంటూ 'ఎక్స్' వేదికగా మోదీ పోస్టు చేశారు. రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా నేడు సద్భావనా దివస్ జరుపుకుంటారు. ఇందులో జాతీయ ఐక్యత, శాంతి, సామరస్యం, యువతపై దృష్టి, లౌకికవాదం వంటి అంశాలు ఉన్నాయి. విభిన్న వర్గాల మధ్య ఐక్యతను బలోపేతం చేయడం, కుల, మత, జాతి భేదాలకు అతీతంగా సోదరభావాన్ని పెంపొందించడం, ఆధునిక, సమ్మిళిత దేశ నిర్మాణానికి దోహదపడేలా యువతను ప్రేరేపించడం వంటివి రాజీవ్ గాంధీ దార్శనికతలో భాగం. అంతేకాక భిన్నత్వంలో ఏకత్వం అనే దేశ సంప్రదాయాలు, విలువలను నిలబెట్టడానికి ఆయన కృషి చేశారు.



# వందేమాతరంపై కాంగ్రెస్ కొత్త నిర్ణయం

- **మొదటి రెండు చరణాలకే పరిమితం.. బీజేపీ తీవ్ర విమర్శలు**

**న్యూఢిల్లీ, ఆగస్టు 21, సిరి న్యూస్:**



అమిత్‌షా తీవ్ర విమర్శలు

కాంగ్రెస్ నిర్ణయంపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తీవ్రంగా స్పందించారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం జాతీయ భావాలను పక్కనపెడుతోందని కాంగ్రెస్‌పై విమర్శలు చేశారు. గతంలో వందేమాతరాన్ని రెండు భాగాలుగా చూడటం వల్ల దేశం తీవ్ర పరిణామాలను ఎదుర్కొందని, ఇప్పుడు అదే విధానాన్ని కాంగ్రెస్ మళ్లీ అనుసరిస్తోందని ఆరోపించారు. వందేమాతరం రచయిత బంకిం చంద్ర ఛటర్జీతో పాటు స్వాతంత్ర్య సమరయోధులను కాంగ్రెస్ అవమానిస్తోందని అన్నారు.

**కొత్త ముస్లిం లీగ్ అంటూ నితిన్ నబీన్**

బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ కూడా కాంగ్రెస్‌పై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. స్వాతంత్ర్య పోరాటంలో వేలాది మంది అమరవీరులకు వందేమాతరం స్ఫూర్తినిచ్చిందని, అలాంటి గేయాన్ని పరిమితం చేయడం దేశ ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని విమర్శించారు. ఓటు బ్యాంకు రాజకీయాల కారణంగానే కాంగ్రెస్ ఈ నిర్ణయం తీసుకుందని ఆరోపిస్తూ, ఆ పార్టీని కొత్త ముస్లిం లీగ్‌తో పోల్చారు.

**1937 నాటి తీర్మానమే ఆధారం**

కాంగ్రెస్ మాత్రం తాము కొత్తగా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని చెబుతోంది. 1937లో మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, సుభాష్ చంద్రబోస్, వల్లభ్‌భాయ్ పటేల్, అబుల్ కలాం ఆజాద్ తదితరులతో కూడిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీసుకున్న నిర్ణయాన్నే ఇప్పుడు కొనసాగిస్తున్నామని పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తెలిపారు. అప్పట్లో జాతీయ సభల్లో వందే మాతరం మొదటి రెండు చరణాలను మాత్రమే ఆలపించాలని సిఫార్సు చేసిన విషయాన్ని గుర్తుచేశారు.

**మిగతా చరణాలపై అభ్యంతరాలు**

వందేమాతరం గేయంలో మొత్తం ఆరు చరణాలు ఉన్నాయి. మొదటి రెండు చరణాల్లో ప్రకృతి అందాలు, నదులు, పచ్చని పంట పొలాలు, మాతృభూమి గొప్పతనాన్ని వర్ణిస్తారు. మిగిలిన చరణాల్లో మాతృభూమిని దుర్గ, లక్ష్మి, సరస్వతి వంటి హిందూ దేవతలతో పోల్చడం, యుద్ధ భావనలను ప్రస్తావించడం వంటి అంశాలపై గతంలో కొన్ని వర్గాలు అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. దీంతో అన్ని వర్గాల ఆమోదం కోసం మొదటి రెండు చరణాలకే పరిమితం చేయాలనే అభిప్రాయం అప్పట్లో వ్యక్తమైంది.

కొత్త ప్రోటోకాల్‌తో మళ్లీ వివాదం

వందేమాతరం 150 ఏళ్ల వేడుకల నేపథ్యంలో గతంలో పార్లమెంట్‌లోనూ ఈ అంశంపై చర్చ జరిగింది. కేంద్ర ప్రభుత్వం జాతీయ గేయానికి సంబంధించి కొత్త అధికారిక ప్రోటోకాల్‌ను తీసుకొచ్చిన నేపథ్యంలో వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో పూర్తి గేయాన్ని ఆలపించాలనే కేంద్ర విధానానికి, కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లో మొదటి రెండు చరణాలకే పరిమితం కావాలనే నిర్ణయానికి మధ్య స్పష్టమైన భేదం ఏర్పడింది. దీంతో వందేమాతరం అంశం రానున్న రోజుల్లోనూ రాజకీయంగా వేడెక్కే అవకాశం కనిపిస్తోంది.


# రాజకీయంగా మోదీ, అమిత్ షా పని అయిపోయింది

- **ప్రతిపక్ష కూటమి మరింత బలోపేతం**
- **కాంగ్రెస్ సమావేశంలో అగ్రనేత రాహుల్ గాంధీ**

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 20, సిరి న్యూస్ :**



ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాలపై లోక్‌సభ లో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ మరోసారి విమర్శలు గుప్పించారు. ఎన్డీయేలో బీజేపీ రాజకీయ ఆధిపత్యం క్షీణించిందని, మోదీ, అమిత్ షా రాజకీయ ప్రయాణం ముగిసిపోయింద ని అన్నా రు. కాంగ్రెస్ పార్టీ సమావేశంలో మాట్లా డుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కేంద్రంలో బీజేపీకి స్వతంత్రంగా మెజారిటీ లేకపోవడంవల్ల ఆ పార్టీ రాజకీయ శక్తి, పట్టు పూర్తిగా తగ్గిపో యాయని రాహుల్ గాంధీ అన్నారు. గతంలో చూపిన రాజ కీయ ఆధిపత్యాన్ని మోదీ, అమిత్ షా జోడీ ఇప్పుడు కోల్పో యిందని పేర్కొన్నారు. ఈ నేప థ్యంలో ప్రతిపక్షంగా కాంగ్రెస్ పార్టీ, 'ఇండియా' కూటమి మరింత వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోందని వెల్లడించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యక ర్తలు ప్రజల సమస్యలపై పోరాటాన్ని మరిం త తీవ్రతరం చేయాలని, రాబోయే సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.



# సిక్కు వ్యతిరేక అల్లర్లలో నిందితుడి మృతి

**న్యూఢిల్లీ, ఆగస్టు 20, సిరి న్యూస్ :**

మాజీ ప్రధాని ఇందిరా గాంధీ హత్యానంతరం జరిగిన సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్న కాంగ్రెస్ మాజీ ఎంపీ సజ్జన్ కుమార్(80) మృతిచెందారు. ఢిల్లీలోని తీహార్ జైల్‌లో ఉన్న ఆయనను గురువారం సప్దర్‌జంగ్ హాస్పిటల్‌కి తీసుకెళ్లగా అప్పటికే మరణించినట్టు వైద్యులు తెలిపారు. సజ్జన్ మృతికి గల కారణాలు హాస్పిటల్ వర్గాలు ఇంకా వెల్లడించాల్సి ఉంది. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ 1984లో సిక్కు మతస్తులైన తన బాడీగార్డుల చేతిలో హత్యకు గురైన విషయం తెలిసిందే. ఆ తరువాత ఢిల్లీ సహా ఉత్తరాదిన పలు ప్రాంతాల్లో సిక్కులపై భారీ స్థాయిలో మూక దాడులు జరిగాయి. ఇందుకు సంబంధించి కొన్ని కేసుల్లో సజ్జన్ కుమార్ దోషిగా తేలారు. ఈ దాడుల్లో సిక్కుల వ్యాపారాలు, నివాస సముదాయాలపై దాడులు జరిగాయి. అనేకమంది చనిపోయారు. పలామ్ కాలనీ ఏరియాలో జరిగిన ఐదుగురి హత్య ఉదంతంలో ఢిల్లీ హైకోర్టు సజ్జన్ కుమార్‌ను 2018లో దోషిగా తేల్చి యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. ఆ తరువాత ఢిల్లీ సారస్వత్ నగర్‌లో ఇద్దరు సిక్కుల హత్య కేసులో ఢిల్లీ హైకోర్టు 2025లో యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. ఢిల్లీలోని జనక్‌పురి, వికాస్‌పురి ప్రాంతాల్లో జరిగిన హింసాత్మక ఘటనల కేసులో మాత్రం సజ్జన్ పాత్రను నిరూపించే ఆధారాలు లేకపోవడంతో కోర్టులో విముక్తి లభించింది. జాట్ వర్గం కీలక నేత సజ్జన్ కుమార్ 1980ల్లో ఢిల్లీ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించారు. 1977లో స్థానిక కౌన్సిలర్‌గా కెరీర్ ప్రారంభించిన ఆయన ఆ తరువాత ఔటర్ ఢిల్లీ నియోజకర్గం నుంచి మూడుసార్లు ఎంపీగా గెలిచారు.



# బార్ అసోసియేషన్‌కు జంధ్యాల ఎన్నిక

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 20, సిరి న్యూస్ :**

సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నికల్లో జంధ్యాల రవి శంకర్ ఘన విజయం సాధించారు. అసోసియేషన్‌లో సీనియర్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన జంధ్యాల ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్ర విద్యను పూర్తి చేసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్‌ను ప్రారంభించారు. గతంలో ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్లు, గవర్నర్లకు న్యాయ సలహాదారుగా రవిశంకర్ విశేష సేవలు అందించారు. గత వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు రాజధానుల బిల్లుకు వ్యతిరేకంగా ఏపీ హైకోర్టులో ఆయన వాదనలు వినిపించారు. 2023 నుంచి సుప్రీంకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్న రవిశంకర్ పలు కీలక కేసుల్లో వాదనలు వినిపించారు. మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే, జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లా తరఫున సుప్రీంకోర్టులో వాదించారు. తెలంగాణలోనూ ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులకు సంబంధించిన పిటిషన్లలో అసెంబ్లీ స్పీకర్ తరఫున రవిశంకర్ వాదనలు వినిపిస్తున్నారు.

# పాఠశాలల దుస్థితిపై సీజేపీ ఆగ్రహం

- **విద్యార్థులకు కనీస వసతులు లేవు: అభిజీత్ దీప్కే**
- **విద్యాశాఖ మంత్రి దాదా భుసే రాజీనామాకు డిమాండ్**
- **పాఠశాలల్లో మౌలిక వసతుల కొరతపై విమర్శలు**
- **పాములకు నిలయాలుగా మారుతున్న పాఠశాలల ఆవరణలు**
- **ప్రజాప్రతినిధులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని సూచన**
- **2029 నాటికి జెన్‌జీ కీలక ఎన్నికల శక్తిగా మారుతుందని వ్యాఖ్య**

**లాతూర్, ఆగస్టు 21, సిరి న్యూస్:**

మహారాష్ట్రలో ప్రభుత్వ పాఠశాలల దుస్థితిపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కన్వీనర్ అభిజీత్ దీప్కే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు పెంచుకునే కుక్కలకు ఉన్న సదుపాయాలు కూడా విద్యార్థులకు లేవని విమర్శించారు. మహారాష్ట్ర విద్యాశాఖ మంత్రి దాదా భుసే వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

**పాఠశాలల దుస్థితిపై పరిశీలన**

'స్కూల్ ఠీక్ కరో' ఉద్యమంలో భాగంగా సీజేపీ బృందం లాతూర్ జిల్లా ఔసా తహసీల్‌లోని ఉజని జిల్లా పరిషత్ పాఠశాలను పరిశీలించింది. రేకుల పైకప్పుల నుంచి నీరు కారడం, అపరిశుభ్రత, చెత్తాచెదారంతో పాఠశాల పరిసరాలు అధ్వానంగా మారాయని దీప్కే పేర్కొన్నారు.

**పాములకు నిలయాలుగా ఆవరణలు**

పాఠశాలల్లో సరైన తరగతి గదులు, బెంచీలు, మరుగుదొడ్లు, సురక్షిత రహదారులు వంటి కనీస సౌకర్యాలు కూడా లేవని ఆయన ఆరోపించారు. పాఠశాల ఆవరణలు పాములకు నిలయాలుగా మారుతున్నాయని, పాముకాటుతో విద్యార్థులు ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు.

**నాయకులపై దీప్కే విమర్శలు**

విద్యార్థుల సమస్యలను పట్టించుకోని ప్రజాప్రతినిధులకు ప్రజలు ఎందుకు ఓటేయాలని దీప్కే ప్రశ్నించారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తేనే అక్కడి సమస్యల తీవ్రత రాజకీయ నాయకులకు అర్థమవుతుందని అన్నారు. పాఠశాలల పరిస్థితులు మెరుగుపడే వరకు నాయకులను ఓట్ల కోసం గ్రామాల్లోకి రానివ్వకూడదని ప్రజలకు పిలుపునిచ్చారు.

**పిల్లల భవిష్యత్తుపై దృష్టి పెట్టాలి**

'ధర్మం ప్రమాదంలో ఉంది' అంటూ రాజకీయాలు చేసే నాయకులు విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతున్న విషయాన్ని గుర్తించాలని దీప్కే సూచించారు. ప్రభుత్వ పాఠశాలలకు తక్షణమే మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

**2029లో జెన్‌జీ కీలకం**

2029 ఎన్నికల నాటికి జెన్‌జీ యువత కీలక ఎన్నికల శక్తిగా మారుతుందని దీప్కే పేర్కొన్నారు. యువత సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైతే గ్రామాల స్థాయిలో పెద్ద ఎత్తున నిరసనలు జరుగుతాయని హెచ్చరించారు. లాతూర్ నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ కేసులో సీబీఐ దర్యాప్తు కింది స్థాయి నిందితులకే పరిమితమైందని ఆరోపించారు. భారీ కుంభకోణం వెనుక ఉన్న పెద్దల పాత్రను వెలికితీయాలని డిమాండ్ చేశారు.



## ఘనంగా మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు

### పాల్గొన్న నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి



**పెద్ద శంకరం పేట, ఆగస్టు 20, (సిరి న్యూస్)**

పెద్ద శంకరం పేట మండల కేంద్రంలోని మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో భారత మాజీ ప్రధాని, భారతరత్న దివంగత రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ శ్రేణులు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నారాయణఖేడ్ శాసనస భ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి హాజరై, రాజీవ్ గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ.. భారత దేశాన్ని ఆధునిక యుగం వైపు నడిపించిన దార్శనికుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. నేడు దేశంలో యువత అనుభవిస్తున్న టెలికాం, కంప్యూటర్, ఐటీ విప్లవానికి నాంది పలికిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించి యువతను దేశ రాజకీయాల్లో భాగస్వాములను చేసిన మహోన్నత నాయకుడని గుర్తుచేశారు. స్థానిక సంస్థల్లో మహిళలకు, బడుగు బలహీన వర్గాలకు 73, 74 రాజ్యాంగ సవరణల ద్వారా రాజకీయ ప్రాధాన్యత కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. రాజీవ్ గాంధీ ఆశయాలను ప్రతి ఒక్క కార్యకర్త ముందుకు తీసుకెళ్లాలని, ఆయన చూపిన బాటలో నడవాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,స్థానిక ప్రజాప్రతినిధులు,మండల స్థాయి నాయకులు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ బాధ్యులు, పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ఎంఈఓను సన్మానించిన ఉపాధ్యాయులు



**తూప్రాన్ ఆగస్టు 20 సిరి న్యూస్**

తూప్రాన్ మండలం ఎంఈఓ ను గురువారం మండల పరిధిలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు సన్మాన కార్యక్రమం చేశారు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లాలో ఉత్తమ మండల విద్యాధికారిగా తూప్రాన్ మండల ఎంఈఓ సత్యనారాయణ ఎంపికయ్యారు స్వాతంత్ర్య దినోత్సవం రోజు జిల్లా కలెక్టరేట్ లో జరిగిన కార్యక్రమంలో జిల్లా ఇంచార్జీ మంత్రి వివేక్ వెంకట స్వామి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ డి ఈ ఓ రాజు చేతుల మీదుగా అవార్డు తీసుకున్న సందర్భంగా తూప్రాన్ బాలుర ఉన్నత పాఠశాల లో జరిగిన కాంప్లెక్స్ సమావేశంలో మండల ఉపాధ్యాయులందరూ ఎంఈఓ ను ఘనంగా సన్మానించారు ఎంఈఓ మాట్లాడుతూ తూప్రాన్ మండలంలోని ఉపాధ్యాయులందరూ సమయపాలన పాటించి వారి విధులను సక్రమంగా నిర్వహించడం ద్వారానే నాకు గుర్తింపు వచ్చిందని ఈ అవార్డు మండల టీచర్లకే అంకితమని కష్టపడి పనిచేస్తే తప్పనిసరిగా గుర్తింపు వస్తుందని అన్నారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జిడ్డి ఎల్లం సంతోష్ భాను చందర్ ఆర్పీలు గాంధీ శ్రీధర్ యాదగిరి నరేష్ రెడ్డి మల్లిక రాణి సాబెరా బేగం జ్యోతి వనిత సుజాత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## హస్మత్ పేట్ లో రాజీవ్ గాంధీ స్మరణ..

### హస్మత్ పేట్ లో రాజీవ్ జయంతి వేడుకలు ఘనం.. కేక్ కట్ చేసి నివాళులర్పించిన కాంగ్రెస్ శ్రేణులు..



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 20 ( సిరి న్యూస్ ):**

భారత మాజీ ప్రధానమంత్రి, రాజీవ్ గాంధీ 82వ జయంతి సందర్భంగా హస్మత్‌పేట్ 264వ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాజీవ్ గాంధీ దేశాభివృద్ధికి చేసిన సేవలు, ఆధునిక భారత నిర్మాణానికి అందించిన కృషిని కాంగ్రెస్ శ్రేణులు స్మరించుకున్నారు. యువ కాంగ్రెస్ నాయకులు మున్ను, అంజద్ అలీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి రాజీవ్ గాంధీకి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, దేశాన్ని ఆధునిక సాంకేతికత వైపు నడిపించడంలో రాజీవ్ గాంధీ కీలక పాత్ర పోషించారని తెలిపారు. యువతకు అవకాశాలు కల్పించడం, దేశ ప్రగతికి నూతన మార్గాలను చూపడంలో ఆయన చేసిన కృషి మరువలేనిదని పేర్కొన్నారు.

రాజీవ్ గాంధీ ఆశయాలను కొనసాగిస్తూ ప్రజాసేవలో ముందుకు సాగడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని నాయకులు అన్నారు. ఆయన సేవలు, ఆలోచనలు నేటి తరానికి స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ముస్తఫా అలీ, దండగుల అశోక్, రాజేందర్, కిరణ్ గౌడ్, కుమార్, శైవ యాదవ్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని రాజీవ్ గాంధీ చిత్రపటానికి నివాళులు అర్పించారు..

# ఓటు హక్కు విలువను చిన్ననాటి నుంచే నేర్పిస్తున్న గీతా స్కూల్

**పటాన్ చెరు, ఆగస్టు 20, (సిరి న్యూస్)**



శాంతినగర్ లోని గీతా స్కూల్ ఆధ్వర్యంలో విద్యార్థుల స్కూల్ లీడర్ ఎన్నికల కార్యక్రమం ఎంతో ప్రజాస్వామ్య బద్ధంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎక్స్‌అఫీషియో మెంబర్‌గా, ముఖ్యఅతిథిగా మాద్రి పృథ్వీరాజ్ హాజరై విద్యార్థుల ఓటింగ్ ప్రక్రియను పరిశీలించారు. నాయకుడిని ఎలా ఎన్నుకోవాలి? ఓటు ఎందుకు వేయాలి? మన ఓటుతో ఎలాంటి మార్పు తీసుకురావచ్చు?" అనే విషయాలను చిన్ననాటి నుంచే విద్యార్థులకు పరిచయం చేయడం అభినందనీయం. ప్రజాస్వామ్యంలో ఓటు కేవలం ఒక హక్కు మాత్రమే కాదు... మన భవిష్యత్తును నిర్ణయించే బాధ్యత. నాయకుడిని ఎన్నుకునేటప్పుడు వ్యక్తిగత పరిచయాలు, ప్రలోభాలు కాకుండా నాయకత్వ లక్షణాలు, బాధ్యత, నిజాయితీ, సేవాభావం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని విద్యార్థులకు అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రత్యేకత. ఎన్నికైన నాయకుడు తనను ఎన్నుకున్న విద్యార్థుల సమస్యలతో పాటు, వారి తల్లిదండ్రులు మరియు పాఠశాల అవసరాల పట్ల కూడా బాధ్యతగా వ్యవహరించాలనే భావనను చిన్న వయసులోనే విద్యార్థుల మనసుల్లో నాటడం ద్వారా భవిష్యత్ లో బాధ్యతాయుతమైన పౌరులను తీర్చిదిద్దే గొప్ప కార్యక్రమానికి గీతా స్కూల్ శ్రీకారం చుట్టింది. ఈరోజు స్కూల్‌లో వేసిన ఓటు... రేపటి సమాజంలో వేసే బాధ్యతాయుతమైన ఓటుకు తొలి అడుగు.

# ఆధునిక సాంకేతిక విప్లవానికి ఆద్యుడు రాజీవ్ గాంధీ

- దేశం కోసం ప్రాణాలర్పించిన ఘనత ఆ మహనీయుడి సొంతం
- నీలం మధు ముదిరాజ్
- చిట్కుల్ లో ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు

**పటాన్ చెరు, ఆగస్టు 20, (సిరి న్యూస్):**



ఆధునిక సాంకేతిక విప్లవానికి ఆద్యుడు, టెలికాం రంగంలో సరికొత్త సంస్కరణలు తెచ్చి భారత దేశాన్ని టెక్నాలజీలో పరుగులు పెట్టించిన మహా ఘనత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకి దక్కుతుందని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ అన్నారు. గురువారం రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకొని చిట్కుల్ లోని ఎన్ఎంఆర్ క్యాంపు కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ భారతదేశంలో డిజిటల్ విప్లవానికి నాంది పలికింది రాజీవ్ గాంధీ అని అన్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీకి పెద్దపీట వేస్తూ పలు సంస్కరణలు తీసుకొని వచ్చి సాంకేతిక విప్లవాన్ని అభివృద్ధి దిశగా నడిపించారని కొనియాడారు. సైన్స్ అండ్ టెక్నాలజీ అభివృద్ధి కోసం విమానయానం టెలికమ్యూనికేషన్ కంప్యూటర్ల ఉత్పత్తులపై పన్నులు తగ్గించి ఆ రంగాన్ని ప్రోత్సహించాడని తెలిపారు. ఆ మహనీయుడు ప్రవేశపెట్టిన ఆ సంస్కరణలతోనే ప్రస్తుతం దేశం టెక్నాలజీలో ముందుకు దూసుకుపోతుందని వివరించారు. దేశాన్ని మరింత అభివృద్ధి దిశగా నడిపించే ప్రయత్నంలో దేశం కోసం ప్రాణాలర్పించిన ఘనత ఆ మహనీయుడి సొంతమన్నారు. భారత దేశ అభివృద్ధికి ఆయన ప్రవేశ పెట్టిన సంస్కరణలు చిరస్థాయిగా నిలిచిపోతాయని తెలిపారు. ఆ మహానుభావుడిని ఆదర్శంగా తీసుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణని ప్రపంచంలో అభివృద్ధి లో మేటిగా నిలిపేందుకు కృషి చేస్తున్నాడన్నారు ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు సంగన్నగారి గోపాల్, దస్తగిరి, మన్నే రాఘవేంద్ర, నారాయణదాసు, సంపత్, నాయకులు అశోక్, శ్రీనివాస్, వీరేష్, అనిల్, రాజ్ కుమార్, కాంగ్రెస్ శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.

# మౌలిక వసతులు కల్పన కు పెద్ద పీట

- పెద్ద శంకరంపేట మండల కేంద్రంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులకు శంకుస్థాపన
- నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి

**పెద్ద శంకరం పేట, ఆగస్టు 20, (సిరి న్యూస్):**




గ్రామాలు, మండల కేంద్రాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని నారాయణఖేడ్ శాసన సభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. పెద్ద శంకరం పేట మండల కేంద్ర పరిధిలో పలు వార్డుల్లో చేపట్టనున్న సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్, డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి శంకు స్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గం లోని ప్రతి గ్రామం, మండల కేంద్రంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అంతర్గత రహదారులు, మురుగు కాలువల వ్యవస్థను పటిష్టం చేస్తున్నాం అని అన్నారు. వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొనే మురుగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకే అత్యంత ప్రాధాన్యతతో డ్రైనేజీ పనులను ప్రారంభించాం. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, నిర్దేశిత గడువు లోగా పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటు లోకి తీసుకురావాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుంటామని, నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, సంబంధిత శాఖల అధికారులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అధునాతన సాంకేతికత పై గీతం అధ్యాపకులకు శిక్షణ

- మ్యాట్ ల్యాబ్ ను ఉపయోగించి మెషిన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్ పై కార్యశాల

**పటాన్ చెరు, ఆగస్టు 20,(సిరి న్యూస్):**



వేగంగా మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకుని, బోధన–శిక్షణా నైపుణ్యాలను మెరుగు పరచుకునేందుకు గాను హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వ విద్యాలయంలోని ఇంజనీరింగ్ అధ్యాపకులకు మ్యాట్ ల్యాబ్ ను ఉపయోగించి మెషిన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్ పై మూడు రోజుల ప్రత్యేక కార్యశాల ను ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించారు. ఈ వర్క్ షాపును ఆర్కాన్స్ ఇన్, మ్యాథ్ వర్క్స్ ల సంయుక్త సహకారంతో గీతం స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్ (జీఎస్సీఈ)లోని ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఈఈసీఈ) విభాగం నిర్వహించింది. ఈ కార్యశాలను, మ్యాట్ ల్యాబ్ ఆధారిత మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్), డీప్ లెర్నింగ్ (డీఎల్)లో అధ్యాపకులకు ఆచరణాత్మక అనుభవాన్ని అందించడానికి రూపొందించారు. ముఖ్యంగా, గణన భావనలను సమకాలీన ఇంజనీరింగ్, పరిశోధన సమస్యలకు పరిష్కారాలు గా మార్చడం పై దృష్టి సారించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక భావనలను ఆచరణాత్మక అమలుతో కలిపి, డేటా–ఆధారిత పద్ధతులను విభిన్న సాంకేతిక రంగాలలో ఎలా అన్వయించ వచ్చో అన్వేషించడానికి గీతం అధ్యాపకులకు వీలు కల్పించారు. మ్యాథ్ వర్క్స్ కు చెందిన సీనియర్ ట్రైనింగ్ ఇంజనీర్ డాక్టర్ శుభ్రోబ్రత భట్టాచార్య ఈ కార్యశాలలో ప్రధాన శిక్షకుడిగా వ్యవహరించారు. ప్రత్యేక సాంకేతిక కార్యక్రమాలు, ముఖాముఖి ద్వారా, ఆయన ఇందులో పాల్గొన్న వారికి కీలకమైన మెషిన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్ భావనలను, అలాగే మ్యాట్ ల్యాబ్ టూల్స్, ఫ్రేమ్ వర్కుల ను ఉపయోగించి వాటి అమలును పరిచయం చేశారు. ఈ సెషన్లు సమకాలీన గణన విధానాలు, ఇంజనీరింగ్, పరిశోధన, సమస్య–పరిష్కారంలో వాటి వినియోగంపై విలువైన అంతర్దృష్టుల ను అందించాయి. వివిధ ఇంజనీరింగ్ విభాగాలకు చెందిన అధ్యాపక బృందం ఈ కార్యశాలలో చురుకుగా పాల్గొని, మ్యాట్ ల్యాబ్, ఫ్రేమ్ వర్కులను ఉపయోగించి మెషిన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్ భావనల అభివృద్ధి, అమలు చేయడంలో ఆచరణాత్మక అనుభవాన్ని పొందారు. ముఖాముఖితో ఆచరణాత్మకంగా సాగిన ఈ శిక్షణలో పాల్గొన్నవారికి అంతర్లీన భావనలు, వాటి ఆచరణాత్మక అనువర్తనాలు.. రెండింటిపై అవగాహనను పటిష్టం చేసుకోవడానికి సహాయపడ్డాయి. ఈ కార్యక్రమం యొక్క ముఖాముఖి స్వభావం, పరిశ్రమకు సంబంధించిన టూల్స్, వర్క్ ఫ్లోలను అన్వేషించే అవకాశాన్ని కూడా కల్పించింది. తద్వారా, ఈ సాంకేతికతలను బోధన, పరిశోధన, ఇంజనీరింగ్ అనువర్తనాలకు వర్తింపజేయడంలో ఇందులో పాల్గొన్న వారి విశ్వాసాన్ని పెంచింది. ఈ కార్యశాలను జీఎస్సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ రమేష్ వడ్డి, ఈఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎం. ప్రశాంత రెడ్డి మార్గదర్శకత్వంలో నిర్వహించారు. డాక్టర్ మాధవి తాతినేని, డాక్టర్ ఎం. మరియదాసు ఈ కార్యక్రమాన్ని సమన్వయపరిచి, విజయవంతంగా నిర్వహించేలా చూశారు.

# జోగిపేటలో ఘనంగా రాజీవ్ జయంతి

**జోగిపేట, ఆగస్టు 20, (సిరి న్యూస్):**

జోగిపేట పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో చేపట్టిన సంక్షేమ పథకాలు యువతకు, పేద ప్రజలకు ఉపయోగపడుతున్నాయన్నారు. ఇంటర్నెట్ సేవలను అమలులోకి తీసుకువచ్చిన ఘనత ఆయన దే అన్నారు. ఈకార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శివరాజ్, మార్కెట్ చైర్మన్ జగన్మోహన్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల చిట్టిబాబు ముదిరాజ్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రవీణ్, మాజీ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు మల్లేశం, మాజీ వార్డు సభ్యుడు ప్రవీణ్‌కుమార్, ఆత్మకమిటీ డైరెక్టర్ ఖాలేద్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ జర్నలిస్టుకు ఆర్థిక సహాయం





- లీల గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్.
- బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంటా రెడ్డి తిరుపతిరెడ్డి.

**రామాయంపేట, ఆగస్టు 20 (సిరి న్యూస్)**

రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న రామాయంపేట మండల జర్నలిస్టు కుస్తీ నారాయణను పలువురు రాజకీయ నాయకులు పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. రామాయంపేట మండలం దామరచెరువు గ్రామానికి చెందిన కుస్తీ నారాయణ ఓ పత్రికలో జర్నలిస్టుగా పనిచేస్తున్నారు. సుమారు 15 రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన తీవ్రంగా గాయపడి కాలు విరిగింది. ప్రస్తుతం చికిత్స పొందుతున్న నారాయణ పరిస్థితిని తెలుసుకున్న లీలా గ్రూప్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మోహన్ నాయక్ గురువారం దామర చెరువు గ్రామానికి చేరుకుని ఆయనను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, వైద్య ఖర్చుల కోసం రూ.5 వేల ఆర్థిక సహాయం అందించారు. అనంతరం విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి స్థానిక బీఆర్ఎస్ నాయకులతో 5000 రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. భవిష్యత్తులో కూడా ఎలాంటి అవసరం వచ్చినా తమ వంతు సహకారం అందిస్తామని వారు హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా జర్నలిస్టు నారాయణ కుటుంబ సభ్యులకు జర్నలిస్టుల సంఘం నాయకులు ధైర్యం చెప్పారు. ప్రమాదం కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న నారాయణ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర కమిటీ సభ్యులు డి.జి. శ్రీనివాస శర్మ, టీయూడబ్ల్యూజే జిల్లా కోశాధికారి వూడెం దేవరాజు, జిల్లా ఉపాధ్యక్షులు పాతూరి రమేష్ గౌడ్, రామాయంపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షులు బసన్నపల్లి మల్లేశం, రామాయంపేట ప్రెస్ జేఏసీ ప్రధాన కార్యదర్శి పటేరి రాము, చంద్రపు అమరేందర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు భానుచందర్, శివ, లీలా గ్రూప్ సభ్యులు సురేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ కాలనీకి ఆర్టీసీ రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేయాలి

**తహసీల్దార్ కు కాలనీవాసుల వినతి.**

**రామాయంపేట, ఆగస్టు 20 (సిరి న్యూస్ )**



రామాయంపేట పట్టణంలోని కేసీఆర్ కాలనీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వద్ద ఆర్టీసీ రిక్వెస్ట్ బస్‌స్టాప్ ఏర్పాటు చేయాలని కోరుతూ కాలనీవాసులు తహసీల్దార్ రజనీకు మారికి వినతిపత్రం సమర్పించారు. పట్టణానికి దూరంగా ఉన్న కాలనీ నుంచి నిత్యావసరాలు, విద్య, వైద్యం తదితర అవసరాల కోసం పట్టణానికి రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు తెలిపారు. కేసీఆర్ కాలనీ మీదుగా ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగిస్తున్నప్పటికీ, బస్‌స్టాప్ లేకపోవడంతో బస్సులు ఎక్కేందుకు, దిగేందుకు అవకాశం లేక ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు పేర్కొన్నారు. కాలనీ వద్ద రిక్వెస్ట్ బస్‌స్టాప్ ఏర్పాటు చేసి ఆర్టీసీ బస్సులు నిలిచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు బాలమణి మాట్లాడుతూ.. కాలనీవాసుల సమస్యను అధికారులు పరిశీలించి వెంటనే కేసీఆర్ కాలనీ వద్ద రిక్వెస్ట్ బస్‌స్టాప్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. బస్‌స్టాప్ ఏర్పాటుతో మహిళలు, వృద్ధులు, విద్యార్థులు, కార్మికులకు రాకపోకల ఇబ్బందులు తొలగుతాయని తెలిపారు. తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన వారిలో కాలనీవాసులు, సీఐటీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్కంఠభరితంగా పోలీస్ అసోసియేషన్ ఎన్నికలు

- రామాయంపేట సర్కిల్ నుండి
- వినోద్, సాజిద్ అలీ ఘన విజయం..
- ఎన్నికల అధికారిగా రామాయంపేట సి ఐ సైదా నాయక్.
- జిల్లాలో మొత్తం ఐదు సర్కిల్ కార్యాలయాలు.
- ఒకేసారి జరిగిన ఎన్నికలు.
- తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక మొదటిసారి ఎన్నికలు.
- మొత్తం కార్యవర్గంలో 21 మంది..
- వీరందరూ కలిసి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, ఇతర పదవులను ఎన్నుకుంటారు.

**రామాయంపేట, ఆగస్టు 20 (సిరి న్యూస్ )**






రామాయంపేట పోలీస్ సర్కిల్ పరిధిలో గురువారం నిర్వహించిన పోలీస్ అసోసియేషన్ ఎన్నికలు ఉత్కంఠ భరితంగా సాగాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం పోలీస్ అసోసియేషన్‌కు తొలిసారిగా ఎన్నికలు నిర్వహించడంతో ఎన్నికలపై పోలీసు సిబ్బందిలో ఆసక్తి నెలకొంది.

ఉదయం 9 గంటలకు ప్రారంభమైన పోలింగ్ ప్రక్రియ సాయంత్రం 5 గంటలకు ముగిసింది. మొత్తం 81 మంది ఓటర్లకు గాను 73 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం ఓట్ల లెక్కింపు చేపట్టి జె. వినోద్, ఎం.డి. సాజిద్ అలీ పోలీస్ అసోసియేషన్ సభ్యులుగా విజయం సాధించినట్లు అధికారులు ప్రకటించారు. ఎన్నికల అధికారిగా రామాయంపేట పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సైదా నాయక్ వ్యవహరించారు విజయం అనంతరం వినోద్, సాజిద్ అలీ మద్దతు దారులు, తోటి పోలీసు ఉద్యోగులు సంబరాలు నిర్వహించారు. ఎన్నికైన సభ్యులను తోటి ఉద్యోగులు అభినందించి ఘనంగా సన్మానించారు. తమపై నమ్మకంతో ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ నూతనంగా ఎన్నికైన సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. గురువారం నాడు మెదక్ జిల్లాలోని ఐదు సర్కిల్ కార్యాలయాల్లో పోలీస్ అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. రామాయంపేట టు పాటు, నర్సాపూర్, మెదక్ రూరల్, తూప్రాన్ అల్లాదుర్గం సర్కిల్ లో ఎన్నికలు నిర్వహించగా పదిమంది విజేతలుగా గెలిచారు. మొత్తం అసోసియేషన్ లో 21 మంది సభ్యులు ఉంటారని, వీరందరూ కలిసి అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, ఇతర పదవులను ఎన్నుకుంటారు.

# డ్రాగన్ ఫ్రూట్ సాగు..లాభాలు బాగు

- డ్రాగన్ ఫ్రూట్ సాగుతో రైతులు అధిక ఆదాయం పొందేలా ప్రోత్సహించాలి.
- ఆర్గానిక్ పద్ధతిలో సాగు చేస్తున్న రైతును అభినందించిన కలెక్టర్.
- డ్రాగన్ ఫ్రూట్ పంటను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్ ఆగస్టు 20(సిరి న్యూస్)**





డ్రాగన్ ఫ్రూట్ సాగుతో అధిక ఆదాయం పొందేలా రైతులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ అన్నారు.

గురువారం హవేలీ ఘనపూర్ మండలం బొగడ భూపతి పూర్ గ్రామంలో పర్యటించి, రైతు దొమ్మట జైపాల్ రెడ్డి సాగు చేస్తున్న ఒక ఎకరం డ్రాగన్ ఫ్రూట్ పంటను పరిశీలించారు. డ్రాగన్ ఫ్రూట్‌ను సాగు చేస్తున్న విధానాన్ని కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి, సాగు వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా డ్రాగన్ ఫ్రూట్ తోటలో మొక్కల పెరుగుదల, పూత వచ్చే విధానం, పంట దిగుబడి, సాగు ఖర్చులు, మార్కెట్ ధరలు, తదితర అంశాలపై కలెక్టర్ రైతుతో వివరంగా మాట్లాడారు. పంట సాగుకు ప్రభుత్వం నుంచి అందిన సబ్సిడీ ఎంత, సబ్సిడీ ద్వారా ఎలాంటి ప్రయోజనం పొందారు అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. డ్రాగన్ ఫ్రూట్ మొక్కలను ఏ సైజులో కట్ చేస్తారు, కత్తిరింపు విధానం ద్వారా మొక్కల పెరుగుదలను ఎలా నియంత్రిస్తున్నారు, కలుపు మొక్కలు రాకుండా ఎలాంటి చర్యలు చేపడుతున్నారు అనే అంశాలపై కూడా ఆరా తీశారు. తోటలో ఏర్పాటు చేసిన డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థ పనితీరును కూడా పరిశీలించి, మొక్కలకు అవసరమైన మేరకు నీటిని అందించే విధానం, నీటి వినియోగ సామర్థ్యం, తదితర వివరాలను రైతును అడిగి తెలుసుకున్నారు. అలాగే డ్రాగన్ ఫ్రూట్ మొక్కలకు పూత ఎలా వస్తుంది, పూత వచ్చిన తర్వాత ఎన్ని రోజులకు కాయలు కోతకు వస్తాయి, ప్రస్తుతం పంటకు మార్కెట్‌లో లభిస్తున్న ధర ఎంత అనే విషయాలపై కలెక్టర్ రైతుతో చర్చించారు. ఆర్గానిక్ పద్ధతిలో డ్రాగన్ ఫ్రూట్ సాగు చేస్తూ, ఆధునిక సాగు విధానాలను అనుసరిస్తున్న రైతు జైపాల్ రెడ్డి అనుభవాలను కలెక్టర్ ఆసక్తిగా తెలుసుకున్నారు. తక్కువ నీటి వినియోగంతో సాగు చేయగల, అధిక విలువ కలిగిన ప్రత్యామ్నాయ పంటలను రైతులు స్వీకరించేలా వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు.సాగులో డ్రిప్ ఇరిగేషన్, సేంద్రియ పద్ధతులు, శాస్త్రీయ యాజమాన్య పద్ధతులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని పేర్కొన్నారు. ఈ పరిశీలనలో ఉద్యాన వన శాఖ అధికారి ప్రతాప్ సింగ్, ఇతర సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలిగా పట్లోళ్ల మల్లిక.



**రామాయంపేట, ఆగస్టు 20( సిరి న్యూస్)**

భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చ నూతన కమిటీని బీజేపీ జిల్లా అధ్యక్షులు వాల్దస్ మల్లేష్ గౌడ్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు పట్లోళ్ల మల్లికా ఆధ్వర్యంలో నూతన ఎన్నుకోవడం జరిగింది.. ఈ కమిటీలో రామాయంపేట పట్టణానికి చెందిన మేకల లావణ్యను జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. అలాగే జిల్లా కార్యదర్శిగా ఎరుపుల మమతను నియమించడం జరిగింది వీరిద్దరూ పార్టీ క్రియాశీలంగా మరియు పార్టీ ఎదుగుదలకు, కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా కృషి చేస్తామని అన్నారు. తమను నియమించినందుకు జిల్లా అధ్యక్షుడు మల్లేష్ గౌడ్ జిల్లా మహిళా అధ్యక్షురాలు మల్లికా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాగి రాములు పట్టణ అధ్యక్షులు శీలం అవినాష్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు.

## ఓల్డ్ బోయిన్ పల్లిలో రాజీవ్ జయంతి..

- రాజీవ్ ఆశయాలే యువతకు దిక్సూచి..
- ఘనంగా రాజీవ్ విగ్రహావిష్కరణ..
- ఆశయ సాధనే నిజమైన నివాళి..
- భారీగా తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు..




**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 20 ( సిరి న్యూస్ ):**

రాజీవ్ గాంధీ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు. దివంగత మాజీ ప్రధానమంత్రి, భారతరత్న రాజీవ్ గాంధీ 82వ జయంతి సందర్భంగా ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ ఎక్స్ రోడ్ చౌరస్తాలో ఆయన విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ సూచనలతో, ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అరవింద్ కిషోర్ నాయుడు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అరవింద్ కిషోర్ నాయుడు మాట్లాడుతూ దేశాన్ని ఆధునిక సాంకేతికత వైపు నడిపించిన దార్శనికుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. యువతకు రాజకీయాల్లో ప్రాధాన్యత కల్పించి, దేశ అభివృద్ధికి బలమైన పునాదులు వేశారని తెలిపారు. ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టడమే నిజమైన నివాళి అన్నారు. అనంతరం రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించడంతో పాటు ప్రజలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బోయిన్‌పల్లి మార్కెట్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నల్లోల రాజేందర్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా డీడీసీ ప్రధాన కార్యదర్శి కిరణ్ గౌడ్, నిచ్చు శివ యాదవ్, ఓల్డ్ బోయిన్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సతీష్ పటేల్, జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి మహమ్మద్ అక్తర్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు విజయలక్ష్మి , రావుల రాజశేఖర్, అఖిల్ గౌడ్, ఎన్ఎస్‌యూఐ మనీషా, ఆదిల్ పటాన్, దేవరకొండ కుమారస్వామి, ప్రశాంత్ జాదవ్, సంతోష్ ముదిరాజ్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించడమే లక్ష్యం

**మంబాపూర్ లో ఫిల్టర్ వాటర్ ప్లాంట్ పునఃప్రారంభానికి చర్యలు**



**గుమ్మడిదల, ఆగస్టు 20( సిరి న్యూస్):**

గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన, శుద్ధి చేసిన తాగునీటిని అందించాలనే ఉద్దేశంతో గతంలో ఏర్పాటు చేసిన ఫిల్టర్ వాటర్ ప్లాంట్‌ను తిరిగి అందుబాటులోకి తీసుకురావడానికి గ్రామపంచాయతీ పాలకవర్గం చర్యలు చేపట్టింది. గుమ్మడిదల మండల పరిధిలోని మంబాపూర్ గ్రామపంచాయతీలోని ఫిల్టర్ వాటర్ ప్లాంట్‌కు అవసరమైన మరమ్మతులు చేపట్టారు. ప్లాంట్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రజలకు నిరంతరాయంగా సేవలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఫిల్టర్ వాటర్ ప్లాంట్‌ను పునరుద్ధరించి తిరిగి వినియోగంలోకి తీసుకురావడానికి పాలకవర్గం చర్యలు చేపట్టడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రవీణ అశోక్ చారి, వార్డు సభ్యులు రాచమల్ల రాజు గౌడ్, ఇస్తారి భాస్కర్, కొండని విజయ్, వడ్డె మౌనిక, రవి, కొండని లీలావతి, అగేష్, మల్లెపల్లి యాదమ్మ, మాజీ సర్పంచ్ కాంజర్ల శ్రీనివాస్, మాజీ వార్డు సభ్యుడు యట దయానంద్, చింతల యాదగిరి, పోచంపల్లి వీరేష్, రొయ్యపల్లి ప్రశాంత్, యట లక్ష్మణ్, నీరుడి శ్రీనివాస్, గుండం మాణిక్యరావు, గొట్టిముక్కల రాజు, తలారి పవన్, కొండని హనుమంతు, కొండని భాస్కర్, మల్లెపల్లి చక్రి తదితర గ్రామస్థులు పాల్గొన్నారు.

# తేనెటీగలతో స్వయం ఉపాధి





**జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.**

**మెదక్ ఆగష్టు 20(సిరి న్యూస్)**

తేనెటీగల పెంపకం స్వయం ఉపాధికి మార్గమని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. గురువారం హవేలీ ఘన్‌పూర్ మండలం బోగడ భూపతిపూర్ గ్రామంలో రైతు జైపాల్ రెడ్డి పొలంలో జిల్లా ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో రైతుల తేనెటీగల పెంపకాన్ని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ పరిశీలించారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదిమంది రైతులకు 104 తేనెటీగల పెంపకం బాక్సులు అందజేయడం జరిగిందని 40% సబ్సిడీ, 60 శాతం లబ్ధిదారుల వాటాతో ఈ తేనె టీగల పెంపకం కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు తెలిపారు. ఒక బాక్సు తేనెటీగల పెంపకానికి 6,000 రూపాయలు ఖర్చుకాగ అందులో ఉద్యానవన శాఖ సబ్సిడీ 2,400 ఉంటుందని, లబ్ధిదారు ని వాటా 3,600 చెల్లించాల్సి ఉంటుందన్నారు.15 రోజుల వ్యవధిలో ఒక బాక్స్ తేనెటీగల పెంపకం ద్వారా మూడు కిలోల తేనె ఉత్పత్తి కాగా ఒక కేజీకి 600 చొప్పున 1800 రూపాయల నికర ఆదాయం వస్తుందన్నారు.104 బాక్సుల ద్వారా 10 మంది రైతులకు 312 కేజీల తేనె ఉత్పత్తి ద్వారా ఒక నెలకు 1,87,200 ఆదాయం చేకూరుతుందన్నారు. జిల్లా ఉద్యానవన శాఖ ప్రోత్సాహకాన్ని ఉపయోగించుకోవాలని తెలిపారు. కొండతెర, కొండిలేని, ఐరోపా, పుట్ట, విసినకర్ర తేనెటీగలు వంటి రకాలు ఆర్థిక ప్రాముఖ్యను అంది స్తాయని స్పష్టం చేశారు. తేనెటీగల పెంపకం నైపుణ్యత గల పరిపూర్ణ అనే వ్యక్తి ద్వారా సంపూర్ణ అవగాహన చేసుకుని పెంపకంలో మేలుకోలు తెలుసుకుని భవిష్యత్తులో ఆర్థిక అభివృద్ధికి బాటలు వేసుకోవాలని కలెక్టర్ ఈ సందర్భంగా రైతులకు సూచించారు. రైతులు వ్యవసాయ సాగు పంట తోపాటు అనుబంధ రంగాల్లో పట్టు సాధించాలన్నారు. వ్యయసాయ అనుబంధ పద్దతుల్లో భాగంగా శాస్త్రీయంగా తేనెటీగల పెంపకంపై జిల్లా ఉద్యానవన శాఖ తీసుకుంటున్న చొరవ ను కొనియాడారు. ఈ పెంపకంలో రైతులు ఉద్యాన పంటలో ఉత్పాదకతను పెంచి ఆదాయంతోపాటు అదనపు ఉపాధి అందుతుందన్నారు. దేశంలోనే తేనె టీగల ఉపయోగాలు వాటి మనుగడలను ప్రాచీన కాలంలోనే గుర్తించినట్లు తెలిపారు. తేనెటీగల పెంపకం అనేది రైతు లకు పంట అధిక సాగు, రైతులకు ఎంత గానో ఆర్థికంగా లాభంచేకూరుస్తుందన్నారు. రైతులు ఆర్థిక స్వాలంభనకు కృషి చేసి జీవితంలో స్థిరపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్ సింగ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి దేవకుమార్, సంబంధిత రైతులు తదితరులు పాల్గొన్నారు.



# రాజీవ్ గాంధీ ఆలోచనలు యువతకు ఆదర్శం

- **మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు**
- **రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఘన నివాళులు**

**మెదక్ ఆగష్టు,20(సిరి న్యూస్)**

యువతే దేశ భవిష్యత్తు" అనే రాజీవ్ గాంధీ ఆలోచనలు స్ఫూర్తిగా తీసుకొని నేటి యువత ముందుకు సాగాలని మెదక్ శాసనసభ్యులు డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు పేర్కొన్నారు. గురువారం మెదక్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించి, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళుల ర్పించారు.ఈ సందర్భంగా మెదక్ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ.. భారతదేశాన్ని ఆధునికత, సాంకేతిక ప్రగతి వైపు నడిపించిన దార్శనిక నాయకుడు, మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ అని కొనియాడారు. భారతదేశ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని యువతకు ప్రాధాన్యత, సాంకేతిక అభివృద్ధి, విద్య, గ్రామీణ ప్రజాస్వామ్యం, ఆధునిక భారత నిర్మాణం వంటి అంశాలకు విశేష ప్రాధాన్యత ఇచ్చారన్నారు. దేశాన్ని 21వ శతాబ్దం వైపు తీసుకెళ్లాలనే ఆయన దూరదృష్టి, యువతపై ఆయనకున్న నమ్మకం, దేశ అభివృద్ధి పట్ల ఆయనకున్న నిబద్ధత నేటి తరానికి కూడా స్ఫూర్తిదాయకం అని సూచించారు. "యువతే దేశ భవిష్యత్తు" అనే రాజీవ్ గాంధీ ఆలోచనలకు స్ఫూర్తిగా... యువ నాయకత్వంలో మెదక్ అభివృద్ధి పథంలో ముందుకు! తీసుకెళ్తామన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ, మెదక్ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామన్నారు. రాజీవ్ గాంధీ ఆశయాలు నేటి తరానికి మార్గదర్శకం అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు అంజనేయులు గౌడ్, మెదక్ మున్సిపల్ చైర్‌పర్సన్ కానుగు రాధిక భూపతి రాజు, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్,జిల్లా మైనారిటీ చైర్మన్ సూఫీ జానీ,కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



# గ్రామాల అభివృద్ధి కోసం సమన్వయంతో పని చేయాలి

- **ప్రజా సమస్యలపై అధికారులు ఎప్పటికప్పుడు స్పందించాలి**
- **సమస్యలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి పరిష్కరించాలి**
- **మండల ప్రత్యేక అధికారి అఖిలేష్ రెడ్డి**

**గుమ్మడిదల, ఆగస్టు 20 ( సిరి న్యూస్ )**

గ్రామాల అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని గుమ్మడిదల మండల ప్రత్యేక అధికారి అఖిలేష్‌రెడ్డి సూచించారు. గుమ్మడిదల మండల పరిధిలోని గ్రామపంచాయతీల సర్వసభ సమావేశం గురువారం ఎంపీడీవో కార్యాలయంలో మండల అభివృద్ధి అధికారి ఉమాదేవి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి అభివృద్ధికి పాటుపడాలని ఆయన సూచించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు గుర్తించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజాప్రతినిధులు కూడా తమ పరిధిలోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, వాటి పరిష్కారానికి చొరవ చూపాలని సూచించారు. అధికారులు ప్రజా సమస్యల పరిష్కారానికి చూపుతున్న చొరవను ప్రజాప్రతినిధులు సద్వినియోగం చేసుకోవాలని ప్రజాభివృద్ధిలో ప్రజాప్రతినిధులు బాధ్యతగా వ్యవహరించాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు ఎప్పటికప్పుడు స్పందిస్తూ క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని అన్నారు.ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ఎనిమిది గ్రామపంచాయతీల సర్పంచ్‌లు హాజరై తమ గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సమావేశంలో చర్చించారు.సమావేశంలో ఆత్మ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, పిఎసిఎస్సి చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, డిప్యూటీ తహసిల్దార్ మల్లేశం, వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, ఎంఈఓ పొలిన, విద్యుత్ ఏఈ రవీందర్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు దుర్గా, రాణి, మంజుల, లావణ్య, భాస్కర్, పెంటారెడ్డి, మహిపాల్‌రెడ్డి, శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.




# చదువుకు ప్రాధాన్యమిస్తే ఉన్నత భవిష్యత్తు

- **గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్**
- **విద్యార్థులకు పరిశ్రమల అండ చదువుకు మరింత ప్రోత్సాహం**
- **సీఎస్ ఆర్ నిధులతో స్టడీ మెటీరియల్ పంపిణీ**

**గుమ్మడిదల, ఆగస్టు 20 (సిరి న్యూస్ ):**



విద్యార్థులు పట్టుదలతో చదువుకుని ప్రతిభను చాటుతూ ఉన్నత శిఖరాలకు ఎదగాలని గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ అన్నారు. గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని బొంతపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెటెరో పరిశ్రమ సీఎస్ ఆర్ నిధులతో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ , నోటు పుస్తకాలు, యూనిఫాం, షూలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థుల అవసరాలను గుర్తించి విద్యా సామగ్రిని అందించడం అభినందనీయమని అన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని చదువుల్లో ముందంజలో నిలవాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తుకు పరిశ్రమలు అందిస్తున్న సహకారం మరింత ప్రోత్సాహాన్నిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు చక్రపాణి, కుమార్ గౌడ్, జైపాల్ రెడ్డి, కో–ఆప్షన్ సభ్యులు భాస్కర్ రెడ్డి, నాయకులు నాగేందర్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, గోపాల్, మహేష్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రెండు రోజులుగా రోడ్డుపక్కనే మహిళ

**గాయంతో బాధపడుతున్న మహిళను ఆసుపత్రికి తరలించిన విలేకరులు**



**గుమ్మడిదల, ఆగస్టు 20 (సిరి న్యూస్):**

రోడ్డు ప్రమాదంలో గాయపడి నడవలేని స్థితిలో రెండు రోజులుగా రోడ్డుపక్కనే ఆకలి, బాధలతో అల్లాడుతున్న ఓ మహిళను గుమ్మడిదల విలేకరులు గుర్తించి మానవీయత చాటుకున్నారు. గాయపడిన మహిళను ఎవరూ పట్టించుకోకుండా అటువైపు వెళ్తున్నప్పటికీ, విలేకరులు స్పందించి 108 అంబులెన్స్ కు సమాచారం అందించి ఆసుపత్రికి తరలించారు. గుమ్మడిదల పురపాలక సంఘం పరిధిలోని బొంతపల్లి కమాన్ సమీపంలో రెండు రోజుల క్రితం రోడ్డు దాటుతున్న గుర్తుతెలియని మహిళను ఓ వాహనం ఢీకొట్టినట్లు తెలిసింది. ఈ ప్రమాదంలో ఆమె కాలు విరిగి నడవలేని పరిస్థితికి చేరుకుంది. దీంతో రోడ్డుపక్కనే పడుకుని బాధపడుతూ, ఆకలితో అలమటిస్తూ సహాయం కోసం ఎదురుచూస్తున్నట్లు గుర్తించారు. ఈ ప్రాంతంలో నిత్యం వాహనాలు, పాదచారుల రాకపోకలు ఎక్కువగా ఉన్నప్పటికీ, మహిళ పరిస్థితిని గమనించిన వారు ఎవరూ పట్టించుకోకపోవడం స్థానికంగా ఆందోళన కలిగించింది. అయితే గురువారం అటువైపు వెళ్తున్న గుమ్మడిదల విలేకరుల బృందం మహిళ పరిస్థితిని గమనించి వెంటనే ఆమె వద్దకు వెళ్లి వివరాలు తెలుసుకుంది. విలేకరులు రవీందర్ రావు కులకర్ణి, నీరుడి రాజు, నరేందర్ రెడ్డి స్పందించి 108 అంబులెన్స్ కు సమాచారం అందించారు. అనంతరం అంబులెన్స్ లో మహిళను నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం అందేలా చర్యలు చేపట్టారు.

**మానవత్వమే ముఖ్యం**

ఆపదలో ఉన్న వ్యక్తిని చూసి స్పందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈ ఘటన మరోసారి గుర్తుచేసింది. కళ్లముందే ఓ మహిళ రెండు రోజులుగా గాయంతో బాధపడుతున్నప్పటికీ పట్టించుకోని పరిస్థితుల్లో, విలేకరులు స్పందించి ఆసుపత్రికి తరలించడం పలువురి ప్రశంసలు అందుకుంది. ప్రమాదాల్లో గాయపడిన వారిని నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమాచారం అందించి, వారికి అవసరమైన సహాయం అందించాలని స్థానికులు కోరుతున్నారు.

## గుండెపోటుతో మాజీ సర్పంచ్ మృతి

**మంబాపూర్, ఆగస్టు 20 (సిరి న్యూస్):**



గుమ్మడిదల మండల పరిధిలోని మంబాపూర్ గ్రామపంచాయతీ తొలి మహిళా సర్పంచ్ జంగ చంద్రకళ గురువారం గుండెపోటుతో మృతి చెందారు. ఆమె మృతి పట్ల గ్రామ ప్రజలు, కుటుంబ సభ్యులు, నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. టిఆర్ఎస్ పార్టీ తరపున సర్పంచ్ అభ్యర్థిగా గెలుపొందిన జంగ

చంద్రకళ సర్పంచ్‌గా ఉన్న సమయంలో గ్రామ అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేసినట్లు గ్రామస్థులు గుర్తుచేసుకున్నారు. గ్రామంలో ఏదైనా సమస్య తన దృష్టికి వచ్చిన వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకునేవారని తెలిపారు. గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి మంబాపూర్‌ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేశారని పేర్కొన్నారు. గ్రామ ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించి ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ సేవలందించిన చంద్రకళ ఆకస్మిక మృతి గ్రామానికి తీరని లోటని పలువురు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఒక్కసారిగా గుండెపోటు రావడంతో ఆమె మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ చెట్ల పొదలు.. ప్రమాదం పొంచి ఉందా?

**బొంతపల్లి కుమ్మరిగల్లీలో ఆందోళన**

**గుమ్మడిదల, ఆగస్టు 20 (సిరి న్యూస్ ):**



గుమ్మడిదల పురపాలక సంఘం పరిధిలోని బొంతపల్లి వార్డులో కుమ్మరి గల్లీలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ చెట్లు, పొదలు పేరుకుపోయాయి. ట్రాన్స్‌ఫార్మర్‌పై చెట్ల కొమ్మలు వేలాడుతూ ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ ద్వారానే గ్రామంలోని పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా అవుతుండటంతో అధికారులు వెంటనే స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించి, చుట్టూ ఉన్న చెట్లు, పొదలను తొలగించాలని కుమ్మరిగల్లి ప్రజలు కోరుతున్నారు.

## ట్రైన్ కు తగిలి వ్యక్తి మృతి

**తుప్రాన్ ఆగస్టు 20 సిరి న్యూస్**



తుఫాన్ మున్సిపల్ పరిధిలోని 10 వ వార్డు బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన దిడ్డిక వెంకటయ్య కొద్ది నెలల నుండి మతిస్థిమితం కోల్పోయి చెవులు వినపడకుండా గ్రామంలోనే తిరుగుతూ గురువారం మధ్యాహ్నం బ్రాహ్మణపల్లి పాత గేటు వద్ద ట్రైన్ ను గమనించ కుండ బోగీలకు తగిలి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు రైల్వే ఎస్ఐ లింబాద్రి సంఘటన స్థలాన్ని పరిశీలించి పంచినామా నిర్వహించి బాడిని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి...





- ప్రెస్ క్లబ్ భవన విస్తరణకు పూర్తి సహకారం.
- జర్నలిస్టు కాలనీలో నీటి వసతికి చర్యలు.
- మెదక్ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు.
- ఎమ్మెల్యేతో మెదక్ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం భేటీ.
- ఎమ్మెల్యే దృష్టికి పలు సమస్యలు తీసుకెళ్లిన అధ్యక్షులు నర్సింహ్మా చారి.
- జర్నలిస్టుల మౌలిక వసతుల పై సానుకూల స్పందన.

**మెదక్ ఆగష్టు,20(సిరి న్యూస్)**

జర్నలిస్టుల సంక్షేమం, మౌలిక వసతుల కల్పనకు తన వంతు కృషి ఎల్లప్పుడు ఉంటుందని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు పేర్కొన్నారు. గురువారం మెదక్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మెదక్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు శివన్నగారి నరసింహచారి ఆధ్వర్యంలో

ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి బచ్చు సంగమేశ్వర్, కోశాధికారి చెవిటి అశోక్ సమన్వయంతో ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావును నూతన ప్రెస్ క్లబ్ కార్యవర్గం, జర్నలిస్టులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నరసింహ చారి జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా పలువురు జర్నలిస్టుల ఇంటి స్థలాల కేటాయింపు, ప్రెస్ క్లబ్ భవనంపై అంతస్తు నిర్మాణం, జర్నలిస్టు కాలనీ అభివృద్ధి, తాగునీటి సౌకర్యం, ఇతర మౌలిక వసతుల కల్పన వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. జర్నలిస్టుల సమస్యలను సానుకూలంగా విన్న ఎమ్మెల్యే రోహిత్ రావు, వాటి పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మెదక్ ప్రెస్ క్లబ్‌కు అవసరమైన సౌకర్యాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని, జర్నలిస్టు కాలనీలో నీటి వసతి కల్పించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రెస్ క్లబ్ భవనం పై అంతస్తులో అదనపు భవన నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తానని స్పష్టం చేశారు. జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జర్నలిస్టులు ఐక్యంగా పనిచేస్తూ ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలియజేశారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

# ప్రతి వార్డును అభివృద్ధి బాటలో నడిపిస్తాం

- మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్
- 10వ వార్డులో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం

**గుమ్మడిదల, ఆగస్టు 20 (సిరి న్యూస్ ):**



గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి వార్డును సమగ్ర అభివృద్ధి దిశగా తీర్చి దిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామని మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ అన్నారు. గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డులో కౌన్సిలర్ ఆధ్వర్యంలో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు వార్డుల వారీగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. వార్డుల వారీగా స్థానికంగా ఉన్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ముఖ్యంగా ప్రజలు నిత్యం వినియోగించే రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. సీసీ రోడ్ల నిర్మాణంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తొలగడంతో పాటు వర్షాకాలంలో ఏర్పడే రహదారి సమస్యలు కూడా తగ్గుతాయని అన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని, స్థానిక ప్రజలు తమ సమస్యలను కౌన్సిలర్ల దృష్టికి తీసుకువస్తే వాటిని పరిశీలించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. పట్టణంలో రహదారులు, డ్రైనేజీలు, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు దశల వారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని వివరించారు. ప్రజలకు మెరుగైన రహదారులు, నాణ్యమైన మౌలిక సదుపాయాలు అందించడమే లక్ష్యంగా మున్సిపల్ పాలకవర్గం పనిచేస్తోందని అన్నారు. అభివృద్ధి పనుల నాణ్యత విషయంలో రాజీపడకుండా, నిర్దేశిత ప్రమాణాల ప్రకారం పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గౌసియా, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, నాయకులు హుస్సేన్, వెంకట్రాం రెడ్డి, వేణు, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చెన్నూరులో ప్రజల సమస్యలకు ఓపెన్ బాక్స్ సిద్ధం..

- పార్టీలకు అతీతంగా ఫిర్యాదుల స్వీకరణ..
- ప్రతి లేఖను స్వయంగా పరిశీలిస్తా: వివేక్..
- సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు..

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 20 (సిరి న్యూస్)**




చెన్నూరు నియోజకవర్గ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి చొరవ చూపేందుకు వివేక్ వెంకటస్వామి వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా ఓపెన్ బాక్స్ ఏర్పాటు చేసి, ప్రతి ఒక్కరి సమస్య, ఫిర్యాదును నేరుగా తన దృష్టికి తీసుకురావడానికి అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. పార్టీ, కులం, మతం, వర్గం అనే ఎలాంటి భేదాలు లేకుండా

నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరి సమస్యను తెలుసుకోవాలన్నదే తన ఉద్దేశమని వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. ప్రజలకు వ్యక్తిగతంగా చెప్పుకోలేని సమస్యలు ఉన్నా, అధికారుల దృష్టికి తీసుకెళ్లలేని ఇబ్బందులు ఎదురైనా, తనపై ఏదైనా ఫిర్యాదు చేయాలనుకున్నా నేరుగా ఓపెన్ బాక్స్ ద్వారా తెలియజేయవచ్చని సూచించారు. ప్రజలు పెన్ను, పేపర్ తీసుకుని తమ సమస్యను లేదా ఫిర్యాదును స్పష్టంగా రాసి ఓపెన్ బాక్స్‌లో వేయాలని కోరారు. ఈ బాక్స్ తాళం తన వద్దే ఉంటుందని, తానే స్వయంగా బాక్స్ తెరిచి అందులోని ప్రతి లేఖను చదివి పరిశీలిస్తానని వెల్లడించారు. ప్రజలు రాసే ప్రతి ఫిర్యాదును బాధ్యతగా పరిగణించి, సమస్య వాస్తవమైనదిగా తేలితే సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజల మాట నేరుగా తన వరకు చేరాలన్న లక్ష్యంతో చేపట్టిన ఓపెన్ బాక్స్ కార్యక్రమం చెన్నూరు నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. ప్రజల సమస్యలకు వేదికగా ఈ కార్యక్రమం నిలవనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# ఘనంగా వలిగొండలో రాజీవ్ గాంధీ 82 వ జయంతి వేడుకలు



**వలిగొండ ఆగస్టు 20** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో మాజీ ప్రధానమంత్రి భారతరత్న ఆధునిక భారత నిర్మాత మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను వలిగొండ పట్టణ కేంద్రంలో వలిగొండ మండల, పట్టణ,కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బత్తిని సహదేవ్ గౌడ్, పోలేపాక జానకి రాములు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ దేశంలో శాంతి సౌభ్రాతృత్వం, మతసామరస్యం,ఐక్యతను పెంపొందించాలనే సందేశం తో జరుపుకునే సద్భావన దినోత్సవం ప్రజలందరికీ ఒక గొప్ప స్ఫూర్తిగా నిలుస్తుందని సమైక్యతే మన శక్తి సద్భావమే మన ప్రగతి అనే స్ఫూర్తితో రాజీవ్ గాంధీ ఆశయాలను ఆదర్శంగా తీసుకొని బలమైన భారతదేశ నిర్మాణానికి మన వంతు కృషి చేయాలనిపిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వాకిటి అనంతరెడ్డి, మాజీ ఎంపీపీ నూతి రమేష్ రాజ్,పబ్బు సురేందర్, ఐటిపాముల రవీంద్ర,కొండూరు భాస్కర్, రేఖల ప్రభాకర్, బద్దం సంజీవరెడ్డి, రేసు బుచ్చిరెడ్డి, చిలుగూరి సత్తిరెడ్డి, ఉలిపే మల్లేశం, మస్కు నరసింహ, కాసుల వెంకన్న, ఎండి. ఖుర్శిద్,కొండూరు సాయి,బత్తిని వరుణ్ గౌడ్, ఆదిమూలం సోమేష్ ,రాపోలు శ్రీనివాస్,దండ మల్లికార్జున్, రాచమల్ల తిరుపతయ్య, మైసొల్ల యాదగిరి, ఎండి షర్ఫొద్దిన్,తదితర కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎంహెచ్ఏ పోర్టల్స్ లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు ప్రథమ స్థానం



**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 20** : కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలోని ఆధునిక పోర్టల్స్ వినియోగంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 'సమన్వయ' కేటగిరీలో రాష్ట్రంలో మొదటి స్థానం సాధించింది. ఉత్తమ ప్రతిభ కనబరిచిన సైబర్ క్రైమ్ అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ అభినందించారు. 'స్పార్క్ క్లబ్' ద్వారా విద్యార్థులకు ఆన్ లైన్ మోసాలు, ఫేక్ లింకులు, ఓటీపీ మోసాలు, డిజిటల్ అరెస్టులు తదితర సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. యువత సైబర్ భద్రతపై కుటుంబ సభ్యులు, స్నేహితులను కూడా అప్రమత్తం చేయాలని సూచించారు.

## ఇచ్చోడ ఇస్లాంపూర్ లో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం



**ఆదిలాబాద్, ఆగస్టు 20** జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ ఆదేశాల మేరకు ఇచ్చోడ మండలం ఇస్లాంపూర్ గ్రామంలో గురువారం తెల్లవారుజామున కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించినట్లు ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టె ఐపీఎస్ తెలిపారు. సుమారు 150 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో ఉదయం 5 గంటల నుంచి నిర్వహించిన విస్తృత తనిఖీల్లో సరైన పత్రాలు లేని 110 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో, నాలుగు కార్లను స్వాధీనం చేసుకున్నారు. వీటిలో నంబర్ ప్లేట్లు లేని, నకిలీ నంబర్ ప్లేట్లు కలిగిన 15 ద్విచక్ర వాహనాలను గుర్తించి కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. గంజాయి సేవనం, నిల్వ, రవాణా, విక్రయం, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా, మట్కా తదితర చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఏఎస్పీ హెచ్చరించారు. ప్రజల భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు.

## సన్న బియ్యం పంపిణీలో పారదర్శకత పాటించాలి: కలెక్టర్ గరిమ అగ్రవాల్



**బోయినిపల్లి, ఆగస్టు 20** రేషన్ కార్డు లబ్ధిదారులకు ప్రభుత్వం నిర్దేశించిన మేరకు సన్న బియ్యాన్ని పారదర్శకంగా పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. గురువారం బోయినిపల్లి మండల కేంద్రంలోని చౌక ధరల దుకాణాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు.

మూడు నెలలకు సంబంధించిన సన్న బియ్యం పంపిణీ, లబ్ధిదారుల వివరాల ఆన్‌లైన్ నమోదు, ఇప్పటివరకు బియ్యం పొందిన వారి వివరాలను పరిశీలించారు. పంపిణీలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా చూడాలని సూచించారు. తనిఖీలో తహసీల్దార్ షరీఫుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ ఐఆర్ ను పారదర్శకంగా పూర్తి చేయాలి: కలెక్టర్ దివాకర టీఎస్



**ఖమ్మం, ఆగస్టు 20** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్–2026) ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెంలో నో మ్యాపింగ్, అనామలీస్ ఓటర్లకు నోటీసుల జారీ, ధ్రువపత్రాల పరిశీలనను ఆయన తనిఖీ చేశారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన 11 రకాల ధ్రువపత్రాలను పరిగణనలోకి తీసుకుని ప్రతి కేసును నిబంధనల మేరకు పరిష్కరించాలని సూచించారు. సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరించి, అక్టోబర్ 15 వరకు తదుపరి ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు.

## పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహం తొలగించడం అన్యాయం.

**వలిగొండ ఆగస్టు 20** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటాలు చేసి ఇటీవల అమరుడైన మాజీ ఎమ్మెల్యే కీ. శే. పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహం తొలగించడం ఉద్యమకారులను అవమానపరిచినట్టేనని అని ఉద్యమకారుల పోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు జోగు అంజయ్య ఒక ప్రకటనలో విమర్శించారు. వెంటనే తొలగించిన చోటనే విగ్రహం ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.

The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY, editor BADHE JAYASHREE.

# ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురి దుర్మరణం

## అదుపుతప్పి బావిలో పడిన కారు

- మృతులంతా బల్వంతపూర్ గ్రామానికి చెందిన కుటుంబీకులు

సిద్దిపేట, ఆగస్టు 20 సిరిన్యూస్) : దశదినకర్మ కార్యక్రమానికి హాజరై తిరిగివస్తున్న ఓ కుటుంబం ఘోర రోడ్డు ప్రమాదం లో దుర్మరణం చెందారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం అప్పన్నపల్లి గ్రామ శివారులో జరిగిన ప్రమాదంలో నలుగురు దుర్మరణం చెందారు. మృతులు ఒకే కుటుంబానికి చెందినవారు.

2




www.siridaily.com

RNI TG TEL/ 26/A0381

సిరి

People's Voice వార్తపత్రిక

శుక్రవారం
ఆగస్టు-21-2026

సంపుటి (Volume) : 2
సంచిక (Issue) 220

MEDAK, SANGAREDDY, SIDDIPET

పేజీలు : 4






# బండ్లగూడ బాధితులకు భరోసా..

## న్యాయం చేయాల్సిందే!

- బాధితుల తరపున రైల్వే అధికారులకు ఎంపీ వినతి
- దశాబ్దాలుగా నివాసం.. ఇప్పుడు ఖాళీ నోటీసులు
- పేదల ఇళ్లపై రైల్వే నోటీసులతో ఆందోళన
- బాధితుల వాదన పూర్తిగా వినాలని ఎంపీ విజ్ఞప్తి
- రైల్వే భూములకు హద్దులు ఏర్పాటు చేయకపోవడమే కారణం
- ట్రాక్ తొలగింపుతోనే ఇళ్ల నిర్మాణాలు జరిగాయన్న ఎంపీ
- ఒక్కసారిగా ఇళ్లు ఖాళీ చేయడం ఎలా సాధ్యం?
- బాధితులకు తగిన అవకాశం ఇచ్చిన తర్వాతే నిర్ణయం
- పేద కుటుంబాలకు న్యాయం జరిగేలా చూడాలి




## బాధితుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన యాదగిరి యాదవ్

రామచంద్రాపురం, ఆగస్టు 20 (సిరి న్యూస్): బండ్లగూడలో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి రైల్వే అధికారులు జారీ చేసిన నోటీసులపై బాధితులకు న్యాయం చేయాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు కోరారు. గురువారం రైల్ నిలయంలో బాధితులతో కలిసి రైల్వే అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రామచంద్రాపురం మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రఘునందన్ రావు మాట్లాడుతూ.. దశాబ్దాలుగా ఇళ్లు నిర్మించుకుని అక్కడే నివసిస్తున్న పేదలకు ఒక్కసారిగా ఇళ్లు ఖాళీ చేయాలని నోటీసులు ఇవ్వడం సరికాదన్నారు. రైల్వే అధికారులు తమ భూమికి సక్రమంగా హద్దులు ఏర్పాటు చేయకపోవడం, రైల్వే ట్రాక్‌ను సైతం తొలగించడంతోనే ఎన్నో ఏళ్లుగా పేదలు అక్కడ ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్నారని తెలిపారు. ఇన్నేళ్లుగా నివసిస్తున్న వారిని ఒక్కసారిగా ఇళ్లు ఖాళీ చేసి వెళ్లిపోవాలని ఆదేశించడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. బాధితుల వాదనను పూర్తిగా విని, వారికి తగిన అవకాశం కల్పించిన అనంతరం బాధితులకు న్యాయం చేసేలా నిర్ణయం తీసుకోవాలని రైల్వే అధికారులను కోరారు. ఈ సమస్య పరిష్కారానికి మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్ కూడా అధికారుల దృష్టికి బాధితుల సమస్యలను తీసుకెళ్లారు.

# పోచారం అడవికి కొత్త శోభ

## అడవి అందాలను ఆస్వాదించేందుకు ఆధునిక ప్రయాణ వాహనం

- పోచారం అటవీ ప్రాంతంలో పర్యాటక సౌకర్యాల విస్తరణకు కృషి
- పోచారం అడవిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తాం
- ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు
- పోచారం అడవిలో పర్యాటకుల కోసం కొత్త వెహికల్ జెండా ఊపి ప్రారంభించిన ఎమ్మెల్యే

2




మెదక్, ఆగష్టు,20(సిరి న్యూస్) పోచారం అటవీ ప్రాంతంలో పర్యాటకులను ఆకర్షించడంతో పాటు అడవి అందాలను మరింత సౌకర్యవంతంగా వీక్షించేలా కొత్త ప్రయాణ వాహనాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు.మెదక్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు ఈ కార్యక్రమానికి హాజరై, పోచారం అడవిలో పర్యాటకుల ప్రయాణానికి ఉపయోగపడే ఆధునిక వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ పోచారం అటవీ ప్రాంతం ప్రకృతి సౌందర్యంతో ఎంతో ప్రత్యేకత కలిగి ఉందని అన్నారు. అటవీ ప్రాంతానికి వచ్చే పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు, ప్రకృతి అందాలను దగ్గరగా వీక్షించే అవకాశం కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పర్యాటక రంగం అభివృద్ధి చెందితే స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు, పోచారం ప్రాంతానికి మరింత గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే తెలిపారు.

# ఉప సర్పంచ్‌లకు రూ.5 వేల గౌరవ వేతనం ఇవ్వాలి

- వార్డు సభ్యులకు రూ.3 వేల గౌరవ వేతనం చెల్లించాలి.
- శిలాఫలకాలపై ఉప సర్పంచ్‌ల పేర్లు ఏర్పాటు చేయాలి.
- ఉప సర్పంచ్ ల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కార్తీక్

3









- అడవి అందాలను ఆస్వాదించేం దుకు ఆధునిక ప్రయాణ వాహనం.
- పోచారం అటవీ ప్రాంతంలో పర్యాటక సౌకర్యాల విస్తరణకు కృషి.
- పోచారం అడవిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తాం.
- ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు.
- పోచారం అడవిలో పర్యాటకుల కోసం కొత్త వెహికల్ జెండా ఊపి ప్రారంభించిన ఎమ్మెల్యే

# పోచారం అడవికి కొత్త శోభ

**మెదక్, ఆగష్టు,20(సిరి న్యూస్)** పోచారం అటవీ ప్రాంతంలో పర్యాటకులను ఆకర్షించడంతో పాటు అడవి అందాలను మరింత సౌకర్యవంతంగా వీక్షించేలా కొత్త ప్రయాణ వాహనాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు.మెదక్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు ఈ కార్యక్రమానికి హాజరై, పోచారం అడవిలో పర్యాటకుల ప్రయాణానికి ఉపయోగపడే ఆధునిక వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ పోచారం అటవీ ప్రాంతం ప్రకృతి సౌందర్యంతో ఎంతో ప్రత్యేకత కలిగి ఉందని అన్నారు. అటవీ ప్రాంతానికి వచ్చే పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు, ప్రకృతి అందాలను దగ్గరగా వీక్షించే అవకాశం కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పర్యాటక రంగం అభివృద్ధి చెందితే స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు, పోచారం ప్రాంతానికి మరింత గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. పర్యాటకుల సౌకర్యార్థం ఆధునిక ప్రయాణ వాహనాన్ని ప్రారంభించడం ద్వారా అటవీ ప్రాంతాన్ని సందర్శించే వారికి సౌకర్యవంతమైన ప్రయాణం అందుబాటులోకి వస్తుందని చెప్పారు. ప్రకృతి పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూనే పోచారం అటవీ ప్రాంతాన్ని పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలనీ సంబంధిత అధికారులను ఎమ్మెల్యే సూచించారు. పర్యాటకులు అటవీ ప్రాంతంలో పర్యటించే సమ యంలో అటవీ నియమాలను పాటి స్తూ, ప్రకృతి సంపదను కాపాడాలని ఆయన కోరా రు. పోచారం అడవికి వచ్చే పర్యాటకులకు మెరుగైన వసతులు కల్పించేందుకు భవిష్యత్‌లో మరి న్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు తెలిపారు. ఈ కొత్త వాహనం అందుబాటులోకి రావడంతో పోచారం అటవీ ప్రాంతాన్ని సందర్శించే పర్యాటకులకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణం లభించనుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఫారెస్ట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురి దుర్మరణం

### అదుపుతప్పి బావిలో పడిన కారు

- మృతులంతా బల్వంతపూర్ గ్రామానికి చెందిన కుటుంబీకులు

**సిద్దిపేట, ఆగస్టు 20 సిరిన్యూస్) :** దశదినకర్మ కార్యక్రమానికి హాజరై తిరిగివస్తున్న ఓ కుటుంబం ఘోర రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం అప్పన్నపల్లి గ్రామ శివారులో జరిగిన ప్రమాదంలో నలుగురు దుర్మరణం చెందారు. మృతులు ఒకే కుటుంబానికి చెందినవారు. దుబ్బాక మండలంలోని బల్వంతపూర్ గ్రామానికి చెందిన దండుగుల రాజు (35), అతని భార్య భాగ్య(22), కుమా రుడు నియాన్స్(5), కూతురు శాన్విక(3) సిద్దిపేటలో బంధువు దశదినకర్మకు హాజరై తిరిగి వస్తుండగా.. అప్పన్నపల్లి శివారులో వేగం అదుపుతప్పి కారు బావిలోకి దూసుకెళ్లింది. కారులో ప్రయాణిస్తున్న కుటుంబ సభ్యులు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న దుబ్బాక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, క్రేన్ స హాయ ంతో కారు, మృతదేహాలను బావిలో నుంచి వెలికితీయించారు. మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించారు.





## పాలిటెక్నిక్ ప్రైవేట్ పరం చేయడం మానుకోవాలి

### తరగతుల బహిష్కరణ

జహీరాబాద్, ఆగస్టు 20 : ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను ప్రైవేటు పరం చేయడం మానుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు టి.రాకేష్ డిమాండ్ చేశారు. గురువారం నాడు జహీరాబాద్ లోని శ్రీ కేతకి సంగమేశ్వర పాలిటెక్నిక్ కళాశాలను బహిష్కరించి బంద్ నిర్వహించారు. ప్రభుత్వం పాలిటెక్నిక్ విద్యారంగంలో తీసుకువస్తున్న విధానాలు విద్యార్థుల ప్రయోజనాలు విరుద్ధంగా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తీసుకువస్తున్న శక్తి పాలసీ ప్రైవేట్ కార్పొరేట్ యాజమాన్యాలకు అనుకూలంగా ఉండడం వల్ల విద్యార్థులకు ప్రమాదం ఉందని, దీనివల్ల గ్రామీణ ప్రాంతాల పేద, మధ్య తరగతి విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్య అందుబాటులో లేకుండా పోతుందన్నారు. విద్యార్థులపై ఆర్థిక భారాన్ని తగ్గించి నాణ్యమైన విద్యను అందించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ నాయకులు సందీప్ సాయి గౌడ్, హరీష్, వివేక్, పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ మహిళ మృతి

గజ్వేల్, ఆగస్టు 20 (సిరిన్యూస్): ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన సంఘటన సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని ప్రవీణ్ డయాబెటిక్ జనరల్ హాస్పిటల్‌లో జరిగింది. గిరిపల్లి గ్రామానికి చెందిన నీల చిత్తమ్మ (50) ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి మృతి చెందినట్లు మృతురాలి కుటుంబీకులు తెలిపారు. డాక్టర్ల నిర్లక్ష్యం, చికిత్స వికటించడం వల్లే చిత్తమ్మ మృతి చెందిందని ఆమె భర్త చంద్రయ్య ఆవేదన వ్యక్తం చేశారు. మహిళ మృతితో ఆసుపత్రి వద్ద ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. కుటుంబ సభ్యులు, బంధువులు ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చేందుకు పోలీసులు అక్కడికి చేరుకుని వైద్యుడికి రక్షణ కల్పించారు. అయితే సదరు వైద్యుడిపై గతంలో సైతం పలు ఆరోపణలు ఉండడంతో పూర్తిస్థాయి విచారణ తరువాతే అసలు నిజాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.






# ఉప సర్పంచ్‌లకు రూ.5 వేల గౌరవ వేతనం ఇవ్వాలి


- **వార్డు సభ్యులకు రూ.3 వేల గౌరవ వేతనం చెల్లించాలి.**
- **శిలాఫలకాలపై ఉప సర్పంచ్‌ల పేర్లు ఏర్పాటు చేయాలి.**
- **ఉప సర్పంచ్ ల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కార్తీక్.**

రామాయంపేట, ఆగస్టు 20 (సిరి న్యూస్) తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఉప సర్పంచ్‌లకు నెలకు రూ.5 వేల గౌరవ వేతనం, వార్డు సభ్యులకు రూ.3 వేల గౌరవ వేతనం ఇవ్వాలని ఉప సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కార్తీక్ డిమాండ్ చేశారు. గురువారం నాడు రామాయంపేట పట్టణంలోని ఆద్య హోటల్ లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీల అభివృద్ధిలో ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ వారికి తగిన గుర్తింపు, గౌరవం లభించడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రజాప్రతినిధుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల శిలాఫలకాలపై ఉప సర్పంచ్‌ల పేర్లు కూడా ఏర్పాటు చేయాలని కార్తీక్ డిమాండ్ చేశారు. శిలాఫలకాలపై ఉప సర్పంచ్‌ల పేర్లు పెట్టేందుకు ప్రోటోకాల్ లేదని కొంతమంది అధికారులు చెప్పడం సరికాదన్నారు. ప్రజలచే ఎన్నుకోబడిన ప్రతి ప్రజాప్రతినిధికి ప్రోటోకాల్ ప్రకారం తగిన గౌరవం కల్పించాల్సిందేనని, ఈ విషయంలో రాజ్యాంగబద్ధమైన హక్కులను గౌరవించాలని అన్నారు. కొంతమంది సర్పంచులు వక్రబుద్ధితో ఉప సర్పంచ్‌ల చెక్ పవర్‌ను రద్దు చేయాలని కోరడం సరికాదని కార్తీక్ అన్నారు. ఉప సర్పంచ్‌ల హక్కుల జోలికి వస్తే ఖబడ్దార్ అని హెచ్చరించారు. గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌లతో పాటు ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు కూడా సముచిత గౌరవం, అధికారాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ప్రజల తరఫున ఎన్నికైన ప్రజాప్రతినిధుల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉప సర్పంచ్‌ల ఫోరం ఉపాధ్యక్షుడు రమేష్ గౌడ్, జనగామ జిల్లా అధ్యక్షుడు హరీష్, రామాయంపేట మండల అధ్యక్షుడు బాబు నాయక్, పిట్ల నరేష్, నింగరమైన రమేష్, ఆకుల మహేష్, రాములు, నజాం, బాబు, అంజి రెడ్డి, రామచంద్రం, రాజు, రాములుతో పాటు తదితరులు పాల్గొన్నారు.




# చేగుంట రైల్వే బ్రిడ్జి నిర్మాణం వల్ల ప్రత్యామ్నాయ మార్గాల ఏర్పాటు!

- **ఈనెల 23 అర్ధరాత్రి నుండి పనులు ప్రారంభం**
- **జిల్లా రెవెన్యూ అధికారి అంబదాస్ రాజేశ్వర్**



**మెదక్, ఆగస్టు 20 (సిరీ న్యూస్):** చేగుంట (గాంధీ చౌక్) నుండి మెదక్ వెళ్ళు రోడ్డు నకు గల రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు ఈనెల 23న అర్ధరాత్రి 12.00 గంటల నుండి ప్రారంభమవుతాయని జిల్లా రెవెన్యూ అధికారి అంబదాస్ రాజేశ్వర్ తెలిపారు. ఈ కారణంగా చేగుంట నుండి మెదక్ (ఎల్సి నంబర్.228T) వద్ద రహదారి రాకపోకలను నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు తాత్కాలికముగా నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు. వాహన దారులు ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోవాలని సూచించారు. ద్వి, త్రి చక్ర వాహనములను ఎల్ సి గేటు వద్ద ఉన్న సీసీ రోడ్ నుండి పాత నేషనల్ హైవే చేగుంట పట్టణ సరిహద్దు అనగా ప్రస్తుత ఆర్ యు బి నుండి బస్సు స్టాప్ ఎదురుగా గల వెంచర్ మీదుగా వెళ్లాలి. అలాగే కార్లు, బస్సులు, డిసియం వ్యాన్లు, ఇతర వాహనములు నార్సింగి నుండి చిన్నశంకరంపేట వయా మిర్జాపల్లి డబుల్ రోడ్డు మార్గము ద్వారా వెళ్లాలని సూచించారు. ట్రాక్కులు, భారీ వాహనములు రామాయంపేట నుండి లేదా నర్సాపూర్ మార్గము నుండి వెళ్లాలని తెలిపారు. మాసాయిపేట నుండి మెదక్ ప్రయాణించే వాహనములు చిన్నశంకరంపేట వయా ధర్పల్లి రోడ్ నుండి వెళ్లడానికి, తూప్రాన్ నుండి మెదక్ ప్రయాణించే వాహనములు వెల్దుర్తి - ఉప్పులింగాపూర్ - గవ్వలపల్లి ద్వారా వెళ్లాలని సూచించారు. జిల్లా ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోవాలని, పోలీసుల సూచనలను పాటించాలని జిల్లా రెవెన్యూ అధికారి అంబదాస్ రాజేశ్వర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.





# టాప్ 10లో మనోహరాబాద్ పోలీస్ స్టేషన్

## అవార్డు అందజేసిన డీజీపీ సందీప్ శాండిల్య

మనోహరాబాద్, ఆగస్ట్ 20 (సిరిన్యూస్) : రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన "యాంటీ డ్రగ్ అవేర్‌నెస్ వీక్" సందర్భంగా నిర్వహించిన మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమాల్లో విశేష ప్రతిభ కనబరిచిన పోలీస్ స్టేషన్లు ఎస్ హెచ్ ఓలలో మనోహరాబాద్ పోలీస్ స్టేషన్ టాప్-10 లో ఎంపికైంది. మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజలు విద్యార్థులు, యువతలో అవగాహన కల్పించేందుకు మనోహరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాల నిర్వహణ, ప్రజల భాగస్వామ్యం, సమర్థవంతమైన అవగాహన చర్యలను పరిగణన లోకి తీసుకుని ఈ గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా ఎస్సై బి. సుభాష్ గౌడ్ కు డీజీపీ సందీప్ శాండిల్య, నార్కోటిక్స్ విభాగం ఇన్‌చార్జ్ అధికారులు ప్రశంసలు అందజేశారు. ఈ అవార్డు తన వ్యక్తిగత విజయం గా కాకుండా మనోహరాబాద్ పోలీస్ స్టేషన్ లోని ప్రతి ఒక్క సిబ్బంది సమష్టి కృషి, అంకితభావం, సహకారానికి లభించిన గుర్తింపు గా ఎస్సై సుభాష్ గౌడ్ పేర్కొన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రజలు, తల్లి దండ్రులు, విద్యాసంస్థలు, యువత పోలీసులతో కలిసి పనిచేసి "డ్రగ్ ఫ్రీ సొసైటీ" నిర్మాణానికి సహకరించాలని ఆయన కోరారు